
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
గుంటూరు జిల్లా వార్తలు
5
గురువారం 16 జనవరి 2025





పెదకూరపాడు: ముస్సాపురంలో కోడి పందేలు

# కోడి రూ. కోట్లు



- ఆపేదెవరన్నట్లుగా పందేలు
- రాత్రి వేళలో ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లోనూ..
- అధికారం అండతో రెచ్చిపోయిన నేతలు
- వరసగా ఐదు పందేలు గెలిచిన వారికి బుల్లెట్
- పోలీసుల ప్రేక్షకపాత్ర.. చేతులు మారిన నగదు

(నరసరావుపేట, బాపట్ల, తెనాలి, కొల్లిపర - ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి సంప్రదాయాల ముసుగులో బాపట్ల, గుంటూ రు, పల్నాడు జిల్లాల్లో కోడిపందేలను యథేచ్ఛగా నిర్వహించారు. కత్తి కట్టిన కోళ్ల కాలు దువ్వగా రూ.లక్షలు చేతపట్టి సుదూర ప్రాంతాల నుంచి వేలాదిగా జూదరులు తరలివచ్చా రు. కోడి పందాలు, పేకాట, కోతముక్కాట, నెంబర్లాట అడ్డు అదుపు లేకుండా కొనసాగాయి. మూడు రోజులమీద కోడి పందాలు, కోతముక్కాట మీద సుమారు రూ.200 కోట్లు బెట్టింగ్‌లు జరిగి ఉంటాయని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. వీఐపీ బరిలో లక్ష నుంచి రూ.5 లక్షల పందేలు జరిగాయి. అధికార పార్టీ నేతల అండ.. కన్నెత్తి చూడని పోలీసులు.. బరి తెగించిన నిర్వాహకులతో కోట్లలో నగదు చేతులు మారాయి. బరుల వద్ద కోత ముక్క, నెంబర్లాటలను నిరాటంకంగా నిర్వాహకులు జరి పించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మం గళవారం కనుమ పండుగ సందర్భంగా బుధవారం విచ్చల విడిగా కోడిపందాలు జోరుగా సాగాయి. భోగి పండుగ ముం దు రోజు అరెస్టులు.. బరుల తొలగింపులతో హడావుడి చేసిన పోలీసులు ఆ తర్వాత పత్తాలేకుండా పోయారు. ఫ్లెక్సీలు కట్టి.. మైకు ప్రచారాలతో పందేలపై నిర్వాహకులు హోరెత్తించినా మూడు రోజులు పోలీసులు ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారు. నేరుగా ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీ నేతలే బరుల వద్ద ఉంటూ పందేలను పర్యవేక్షించారు. ఎక్కడయినా కోడి పందే లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించిన పోలీసు అధికారులకు తీర ప్రాంత గ్రామాలతో పాటు, గుం టూరు, పల్నాడు జిల్లాల్లోని పలు పల్లెల నడిబొడ్డున ఏర్పాటు చేసిన బరులు మాత్రం కనిపించక పోవడం విశేషం. బరుల కు సమీపంలో జూదరుల వాహనాలను క్రమబద్ధీకరించడానికి పోలీసులు పరిమితమయ్యారు. ఇక బరుల వద్ద వీవీఐపీ, వీఐ పీ గ్యాలరీలతో పాటు సామాన్య జనం పందేలను వీక్షించడా నికి నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బరిలోకి ప్రవేశం చాలంటే ట్యాగ్‌లు, టోకెన్లు అందజేసి మరీ పందేలను నిర్వ హించారు. బరుల వద్ద జూదరుల కోసం నగదుకు ఇబ్బంది పడకుండా ప్రత్యేకంగా ఏటీఎం తరహా ఏర్పాట్లు కూడా చేశా రు. నేతల అండతో దర్జాగా బరులు ఏర్పాటు చేసిన నిర్వాహ కులు బరుల వద్దకు ప్రవేశించే విషయంలో బౌన్సర్లతో భద్రత ను కట్టుదిట్టం చేసి ఈ దఫా అత్యంత పకడ్బందీగా జూద క్రీడలను నిర్వహించారు. లక్ష రూపాయల చొప్పున పందేలు నడిచాయి. అడిగేదెవరూ.. ఆపేదెవరు అన్నరీతిలో లక్షలు దండుకున్నారు. కొన్ని బరుల వద్ద రాత్రి వేళల్లో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేసి పందేలు నిర్వహించారు. ప్రభుత్వం మారినా గతంలో కన్నా హంగు, ఆర్భాటాలు పెంచి మరీ జూదశిబిరా లు దిగ్విజయంగా నిర్వహించారు. పేకాట కూడా స్థాయిని బట్టి లక్ష నుంచి ఐదు లక్షల వరకు నడిచి నట్లు సమాచారం. బరుల వద్ద కార్ల పార్కింగ్‌కు రూ.200, బైక్ పార్కింగ్‌కు వంద ఇలా అందిన కాడి కి దోచేశారు. బరుల వద్దే పుష్కలంగా మందుతో పాటు మాంస పదార్థాలను కూడా అందుబాటులో ఉంచారు. మొత్తంమీద జూదరులకు బరుల వద్ద ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. మండల స్థాయి కూటమి నేతలు కొందరు పందేల ను లాభసాటి వ్యాపారంగా మార్చుకు న్నారని పార్టీ లోని వక్తులే బహిరంగంగానే విమర్శస్తున్నారు. బరుల వద్దే మద్యం దుకాణా లను ఏర్పాటు చేసి అన్ని బ్రాం డ్లతో పాటు, బీర్లు లభించును అని బోర్డులను ఏర్పా టు చేసిన నిర్వా హకులు యథేచ్ఛగా మద్యం అమ్మకాలు చేశారు. బ్రాండ్‌ను బట్టి క్వార్టర్ బాటిల్‌కు రూ.100 నుంచి రూ.150 వరకు, ఫుల్ బాటిల్‌కు రూ.300కుపైనే అ ధికంగా వసూలు చేశారు. అయినా ఎక్సైజ్ అధికారులు కన్నెత్తి కూ డా చూడలేదు.

### తీరంలో జోరుగా..

బాపట్ల జిల్లా పరిధిలోని తీర ప్రాంత గ్రామాల్లో 8 బరులతో కోడిపందేలు జోరుగా నిర్వహించారు. చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో యథేచ్ఛగా కోడిపందాలు జరిగాయి. తెలంగాణ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, జిల్లాల నుంచి వేలాది సంఖ్యలో జూదరులు తరలిరావడంతో తూర్పుపాలెం బరులు కిటకిటలాడాయి. సంక్రాంతి పండుగ రోజున మంత్రి అన గాని సత్యప్రసాద్, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, సానా సతీష్, మాజీ ఎంపీ మోపిదేవి వెంకటర మణారావు, సినీనిర్మాత సూర్యదేవ రనాగవంశీ తదితరులు పందేలను వీక్షించారు. బరుల సమీపంలో కోత ముక్క, పేకాటకు ప్రత్యేక గుడారా లను వేసి హైటెక్ క్లబ్ తరహాలో ఏర్పాటు చేశారు.

### దుస్తులు, స్వీట్లు పంపిణీ

నగరం మండలం ఏలేటిపాలెం సపోటతోటల్లో వైసీపీకి చెందిన ఓ వ్యక్తి పేకాట, కోతముక్క, యథే చ్ఛగా రెండునెలలుగా కొనసాగిస్తున్నాడు. అయితే సంక్రా ంతిని పురస్కరించుకుని దుస్తులు, కేజీ స్వీటు బాక్సులను జూదరులకు పంపిణీ చేసి ఉత్సాహపరిచారు. కనుమపం డుగ రోజున నాటుకోడి, చిల్లిగారె, మటన్ ధమ్‌బిర్యాని అందజేశారని సమాచారం.

### పల్నాడు జిల్లాలోనూ..

గోదావరి, కృష్ణా జిల్లాలకే పరిమితమైన కోడి పందేలు ఈ ఏడు పల్నాడు జిల్లాకు కూడా విస్తరించాయి. నరసరావు పేట, పెదకూరపాడు, చిలకలూరిపేట నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున కోడి పందేలు జరగ్గా రూలక్షల్లో నగదు చేతులు మారింది. ప్రజాప్రతినిధుల అండతో విజయవంతంగా పందేలు జరిగాయి. కోడి పందేలపై ఫిర్యాదులు అందినా పోలీసులు పట్టీపట్టనట్లుగా ఉన్నారన్న విమర్శలున్నాయి. కొన్ని ప్రాంతాల్లో పోలీసు పహారాలో ప్రశాంతంగా పందేలు నిర్వహించారన్న విమర్శలున్నాయి. ఎస్పీ కే శ్రీనివాసరావు హెచ్చరికలు అమలు కాలేదు. నరసరావుపేట మండలం దొండపాడు, రొంపిచర్ల మండలం కొనకంచివారిపాలెం, ఎడ్వర్డ్‌పేట, నాదెండ్ల మండలం సాతులూరు, అమరావతి మండలంలోని లేమల్లె, పెదకూరపాడు మండలంలోని ముస్సాపురంలో కోడి పందేలు పెద్దఎత్తున జరిగాయి.



రేపల్లె: తూర్పుపాలెంలో జోరుగా నెంబర్లాట



తూర్పుపాలెంలో ఐదు పందేలు గెలిచిన మంత్రిపాలెం వాసులకు బుల్లెట్‌ను బహుకరిస్తున్న సినీ నిర్మాత నాగవంశీ,అనగాని శివప్రసాద్



కొల్లిపరలో కోడి పందేలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్



రేపల్లె: తూర్పుపాలెంలో జోరుగా నెంబర్లాట



కొల్లూరు: క్రాప అడ్డరోడ్డు వద్ద కోడి పందెం బరిలో ఉన్న పందెం రాయుళ్ళు



యడ్లపాడు: సంగంగోపాలపురం వద్ద కోడిపందేలు

### తెలంగాణ నుంచి వచ్చి పందేలు

భోగి మొదలు కనుమ పండుగ రోజయిన బుధవారం వరకు బాపట్ల జిల్లావ్యాప్తంగా వివిధ జూదక్రీడల ద్వారా దాదాపు రూ.60కోట్లు చేతులు మారినట్లు తెలుస్తోంది. దాదాపుగా అందరికీ కనబడేలా ఆయా ప్రాంతాల నడి బొడ్డున సినీ సెట్టింగ్‌లను తలదన్నే రీతితో జిల్లాలో 9 వరకు బరులను ఏర్పాటుచేశారు. ఇందులో ప్రధానంగా పిట్టలవానిపాలెం మండలం మంతెనవారిపాలెం, చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలోని బరుల కు సెలబ్రిటీల తో పాటు సామాన్య జనం పోటె త్తారు. తెలంగాణ నుంచి పెద్దఎత్తున పందేల కోసం రాగా దాదాపుగా రూ.35కోట్ల వరకు వారి దే అన్నట్లు సమాచారం. గతంలో వీరిలో ఎ క్కు వ శాతం పందేల కోసం భీమవరం బాట పట్టేవా రు. కానీ ఈ దఫా అదే స్థాయిలో మంతెనవారి పాలెంలో బరిని ఏర్పాటుచేయడంతో ఇక్కడికి పోటెత్తారు.

### ఐదు పందేలు కొడితే.. బుల్లెట్

మంతెనవారిపాలెం, తూర్పుపాలెంలోని బరుల నిర్వాహకులు రకరకాల ఆఫర్లతో పందెం రాయుళ్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు. వరుసగా ఐదు పందేలు గెలిస్తే బుల్లెట్‌ను బహుమతిగా ప్రకటించారు. రెండు బరుల్లో కలిపి ముగ్గురి వరకు ఈ కానుకను గెలుచుకున్నట్లు తెలుస్తోంది. వరుసగా ఐదుసార్లు పందెం గెలవ డంతో మంత్రిపాలేనికి చెందిన ప్రతాప్‌కు బుల్లెట్‌ను చిత్రనిర్మాత సూర్యదేవరనాగవంశీ, అన గాని శివప్రసాద్‌లు అందజేశారు.

### రాత్రింబవళ్లు సందడే సందడి..

కొల్లూరు: కొల్లూరు మండలంలోని క్రాప అడ్డరోడ్డు, అనంతవరం గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన కోడి బరుల వద్ద నాలుగు రోజులుగా కోలా హల వాతావరణం నెలకొంది. బరుల వద్ద గుండాట, నెంబర్ల ఆట, కోతముక్క, తదితరాలను అందుబాటులోకి తేవడంతో ఆ ప్రాంతం జూదరు లతో సందడి సందడిగా మారింది. రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకు కోడి పందేలు జరగ్గా జూద క్రీడల మాట సరేసరి. ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు కోడి పందాలు జరిగాయి. కోతముక్క, పేకాట మాత్రం రాత్రింబవళ్ళు సాగినట్లు సమాచారం. గురువారం కూడా కోడి పందేలు సాగుతాయని నిర్వాహకులు మైకుల ద్వారా ప్రచారం చేయడం గమనార్హం.

6

మద్యం అమ్మకాల్లో..
సంక్రాంతి జోష్
- 2 రోజులుగా రూ.16.61కోట్ల విక్రయం

నడికుడిలో దొంగల బీభత్సం
- సీసీ కెమెరాలు పగులగొట్టి ఇంట్లో చోరీ
- లక్షల విలువైన బంగారం, నగదు అపహరణ

అనుమానాస్పద స్థితిలో బావ, బావమరిది మృతి
- కల్తీ మద్యమే కారణమా?

# సంబరాలు.. సందళ్లు



తెనాలి: తెప్పోత్సవంలో పాల్గొన్న మంత్రి మనోహర్

- ఊరూరా వేడుకగా సంక్రాంతి
- పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలతో పండుగ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మూడు రోజుల పండుగతో పల్లెలు మురిశాయి. సంక్రాంతి సంబరాలతో ఊరూవాడా సందడి నెలకొంది. ఉద్యోగ, వ్యాపార ఇతర వృత్తులు, ఉపాధి కో సం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు స్వగ్రామాలకు చేరి కుటుంబ సభ్యు లు, బంధుమిత్రులతో కలసి వేడుకలు నిర్వహించుకున్నారు. చిన్నారు లు, విద్యార్థులు గాలిపటాలు ఎగరేసి సందడి చేశారు. పలుగ్రామా ల్లో సంక్రాంతి సంబరాలను మూడు రోజులపాటు కుటుంబస భ్యులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఆట పాటలు, సంస్కృతిక కార్యక్రమాలతో గ్రామాల్లో సందడి వా తావరణం నెలకొంది. సంక్రాంతి, కనుమ సందర్భంగా ఉద యాన్నే ఇళ్లముంగిట రంగవల్లులు వేసి, గొబ్బిళ్లను అమ ర్చి అందంగా తీర్చిదిద్దారు. కొత్తపంట బియ్యంతో పొం గలి సిద్ధం చేసి నైవేద్యం సమర్పించారు. కను మనాడు రథం ముగ్గులతో ముంగిళ్లను తీర్చిదిద్దారు. పలు గ్రా మాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలైన మ హిళలకు బహుమ తులను అందజేశారు. ఎడ్ల పం దేలు, క్రికెట్, వాలీబాల్, ముగ్గుల పోటీల్లో యువత, మహిళలు ఉత్సా హంగా పాల్గొన్నారు. ఎక్కడి కక్కడ యువత ఆధ్వర్యంలో క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు పెద్దఎత్తున జరిగాయి. పలు గ్రామాల్లో నాటికల పోటీలు కూడా నిర్వహించారు. మకర సంక్రాం తి సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పలు ఆలయాల్లో గోదాదేవి కల్యాణాలు కనుల పండువగా జరిగా యి. దేవతా మూర్తుల ఊరేగింపులు, తెప్పోత్స వాలు ఘనంగా జరిగాయి. గుంటూరు, నరస రావుపేట, బాపట్ల తదితర ప్రాంతాల్లో అయ్యప్ప స్వామి దేవాలయాల్లో మకరజ్యోతిని భక్తులు దర్శించుకున్నారు. పడిపూజ ఘనంగా జరిపారు. కనుమ సందర్భంగా రైతులు పశువులను అలంకరించి ప్రత్యేకంగా పూజలు చేశారు. గ్రామాల్లో గోపూజలు ఘనంగా జరిగాయి. కనుమకు మాం సాహారం తినేందుకు ప్రజలు ప్రత్యేక ఆసక్తి చూపారు. జిల్లా కేంద్రం గుంటూ రులో తెల్లవారుజాము నుంచే మ టన్, చికెన్ స్టాల్స్ ఎదుట మాంసాహార ప్రియులు క్యూ కట్టారు.

- గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. మంగళవారం గంగిరెద్దులు, ఎద్దుల ప్రదర్శనలు, వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, కర్రసాము, కోలాటాలు, స్టార్ మ్యూజికల్ నైట్, కాంతారా యాక్ట్, జగలర్స్ షో, బటర్ ఫ్లై, రోబో యాక్ట్ ప్రదర్శనలతో ఎన్టీఆర్ స్టేడియం గ్రామీణ వాతావరణ శోభతో అలరారింది.
- దుగ్గిరాల మండలం ఈమనిగ్రామంలో ఒకే కుటుంబానికి చెం దిన వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన 60మందికి పైగా ఆనందో త్సాహాల మధ్య సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు.



దుగ్గిరాల: ఈమనిలో వేడుకలకు హాజరైన ఒకే కుటుంబసభ్యులు



గుంటూరు: సంపత్‌నగర్‌లో మకరజ్యోతిని దర్శించుకుంటున్న భక్తులు



గుంటూరు: ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన సంబరాల్లో పాల్గొన్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, కమిషనర్ శ్రీనివాస్

# అమరావతి.. ఆనందం





- రాజధాని రైతులకు కౌలు బకాయిల చెల్లింపు
- చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఫొటోలకు పాలాభిషేకం
- ఐదేళ్ల నిరీక్షణ అనంతరం గ్రామాల్లో పండుగ శోభ
- ఆరేడు నెలలుగా రాజధానిలో నిర్మాణ పనులు పరుగులు

తుళ్లూరు, గుంటూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): రాజధాని రైతుల ఇంట.. ఈ సంక్రాంతి సంతోషాల పంటను తీసుకు వచ్చింది. ఒకవైపు ఆరేడు నెలలుగా రాజధానిలో పనులు పరుగులు తీస్తుండగా.. కొన్నేళ్లుగా నిలిచిపోయిన రాజధాని కౌలు బకాయిలను కూటమి ప్రభుత్వం భోగి రోజు విడుదల చేసింది. దీంతో రాజధాని గ్రామాల్లోని ప్రతీ ఇంటా ఆనందోత్సాహాలు వెల్లివిరిశా యి. వైసీపీ పాలనలో ఐ దేళ్లపాటు నిత్య నరకం అనుభవించి, పండుగ లూ, పర్వదినాలకు దూర మైన రైతులు ఈ ఏడాది సంక్రాంతి సంబరాలను ఉత్సాహం గా జరుపుకున్నారు. వైసీపీ పాలకులు, నాటి అధికారపార్టీల నేతల వేధింపులను ఎదుర్కొంటూనే గత ఐదేళ్ల రాజధాని వాసులు పోరుబాటపట్టారు. కిందటేడాది సంక్రాంతి సంద ర్భంగా మందడంలో టీడీపీ- జనసేన కూటమి 'భోగి సంక ల్పం' కార్యక్రమాన్ని నిర్వహించి చంద్రబాబు, పవన్ కల్యాణ్ లు అమరావతిపై వైసీపీ ప్రభుత్వం తెచ్చిన చీకటి జీవోలను మంటల్లో కాల్చేశారు. అదే వేదికగా మరో 87 రోజుల్లో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అమరావతి నుంచి ప్రజా పరిపాలన ప్రారంభమవుతుందని, బంగారంలాంటి రాజధానిని నిర్మిస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారం చేపట్టిన మరుక్షణం నుం చి రాజధాని నిర్మాణపనులను పరుగులు పె ట్టించారు. ప్రమాణ స్వీకారానికి ముందే రాజధాని గ్రామాల్లోని 25వేల ఎకరాల్లో రూ.36.5కోట్లు ఖర్చు చేసి జంగిల్ క్లియరెన్స్ చేశారు. ఐదేళ్ల క్రితం ఆగిపోయిన ప్రభు త్వ భవనాల నిర్మాణం సహా పలు పను ల నిమిత్తం తాజాగా రూ.24 వేల కోట్ల పనులకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. మరో 11,467 కోట్లకు పనులకు ప్రభుత్వం బుధవారం పరిపాలనా ఆమోదం తెలిపింది. దీంతో అమరావ తి నిర్మాణం పరుగులు పెట్టనున్నాయి. ఇప్పటికే రాజధానిలో కీలకమైన సచివా లయ భవన సముదాయ నిర్మాణ పను లకు ప్రభుత్వం రూ.4,890 కోట్లు కేటాయించింది. పునాదుల్లో చేరిన నీటిని భారీ మోటార్లతో తోడుతున్నారు. ఈ నెలాఖరులోపు ఆ పనులు కూడా ప్రారంభమవబోతున్నాయి.

### కౌలు చెల్లింపులతో పండుగే.. పండుగ

రాజధాని రైతులకు గత ప్రభుత్వం పెట్టిన కౌలు బకాయిలను కూడా కూటమి ప్రభుత్వం చెల్లించింది. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు రెండేళ్లపాటు కౌలు నిలిపివేయడంతో ఆ బకాయిలే రూ.525 కోట్లకు పైగా ఉంది. అందులో తొమ్మిదో ఏడాది కౌలు బకాయిలను కూటమి ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లో చెల్లించింది. కాగా అసైన్డ్ రైతులకు సీఐడీ కేసుల కారణంగా బకాయిలు పెండింగులో పడిపోయాయి. ఈ ఆరునెలల్లో వారి కేసులను పరిష్కరించి, వారికి కూడా రాష్ట్ర ప్రభుత్వం కౌలు చెల్లించింది. సాధారణరైతులు 24 వేల మంది రైతులకు ఇచ్చే పదో ఏడాది కౌలుతో పాటు, 3,123 మంది అసైన్డ్ రైతులకు మూడేళ్ల కౌలు బకాయిలను చెల్లించింది. దీంతో తుళ్లూరు, రాయపూడిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు రాజధానివాసులు పాలాభిషేకం చేశారు. బాణాసంచా కాల్చారు. స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. కౌలు బకాయిల విడుదలతో దళిత, ముస్లిం మైనార్టీ కుటుంబాలు నిజమైన పండుగ జరుపుకుంటు న్నామని దళిత బహుజన జేఏసీ అధ్యక్షుడు చిలకా బసవయ్య తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పురపాలక శాఖ మంత్రి నారాయణ, సీఆర్డీఏ కమిషనర్ భాస్కర్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌లకు రైతులు కృతజ్ఞతలు తెలి పారు.



తుళ్లూరులో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రైతులు మహిళలు



వార్షిక కౌలు ఇవ్వటంతో స్వీట్లు పంచుకుంటున్న రైతులు

# స్వామియే శరణం అయ్యప్ప

- వైభవంగా సంపత్‌నగర్ అయ్యప్పస్వామి ఆలయంలో మకర జ్యోతి దర్శనం


మకర జ్యోతిని వెలిగిస్తున్న చైర్మన్ గ్రంధి కాంతారావు దంపతులు, కుటుంబ సభ్యులు

గుంటూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంపత్‌నగర్‌లోని అయ్యప్పస్వామి దేవస్థానంలో మకర సంక్రాంతి పర్వదినాన మకర జ్యోతి దర్శన మహోత్సవం ఈ ఏడాది కూడా క్రేన్ అనుబంధ సంస్థ క్రేన్ రిలీజియస్ ట్రస్ట్, క్రేన్ సంస్థల చైర్మన్ గ్రంధి వెంకటసత్యలక్ష్మీ కాంతారావు, లక్ష్మీ హైమావతి దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా జరిగింది. మంగళవారం సాయంత్రం 5.01 గంటలకు స్వామి వారికి తిరువాభరణాలను సంపత్‌నగర్‌లోని క్రేన్ వక్కపొడి ఫ్యాక్టరీ నుంచి దేవాలయానికి కాంతారావు దంపతులు, వారి పెద్ద అల్లుడు మానేపల్లి దివాకర్, పెద్ద కుమార్తె హిమజ, కుటుంబ సభ్యులు, భక్తులు దేవాలయానికి తీసుకొచ్చారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో శరణు ఘోష నడుమ క్రేన్ గ్రూపు సంస్థల చైర్మన్ గ్రంధి కాంతారావు దంపతులు మకర జ్యోతిని వెలిగించారు. అదే సమయంలో ఆకాశంలో స్వామి వారు నక్షత్ర దర్శనం ఇవ్వటంతో భక్తులు స్వామియే శరణం అయ్యప్ప అంటూ శరణు ఘోషతో పులకరించిపోయారు. ఈ సందర్భంగా జీవీఎస్ఎల్ కాంతారావు మాట్లాడుతూ గత 49 ఏళ్లుగా సంపత్‌నగర్ అయ్యప్ప స్వామి దేవాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, జిల్లా నలుమూలల నుంచి లక్షలాది మంది స్వామి భక్తులు, దీక్షా స్వాములు ఆలయాన్ని ప్రతి ఏటా సందర్శిస్తారన్నారు. మంగళవారం జరిగిన మకర జ్యోతి దర్శన మహోత్సవం గుంటూరు చరిత్రలో మరువరానిదన్నారు. ప్రతి ఏటా డిసెంబరు, జనవరి మాసాల్లో కాకుండా ప్రతి రోజూ నిత్యం అయ్యప్పస్వామికి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో క్రేన్ గ్రూప్ సంస్థల సిబ్బంది, టంగుటూరి మణి, నగర ప్రముఖులు హాజరయ్యారు. అనేక మంది అయ్యప్పస్వామి భక్తులు ప్రత్యేక వాహనాల్లో సాయంత్రం దేవస్థానం నుంచి శబరిమలకు బయల్దేరారు.

# మద్యం అమ్మకాల్లో.. సంక్రాంతి జోష్

- గత 2 రోజులుగా రూ. 16.61 కోట్ల విక్రయం

గుంటూరు కార్పొరేషన్, జనవరి 15( ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ కు మద్యం అమ్మకాలు మరింత ఊపందుకున్నాయి. వాడవాడలా మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. సొంత ఊర్లకు తరలివచ్చిన ప్రజానీకంతో ఆయా గ్రామాలు, పట్టణాలు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. పండగ మూడు రోజులు భారీ స్థాయిలో ఎక్సైజ్ శాఖకు ఆదాయం చేకూరింది. గతేడాది డిసెంబర్ 31, ఈ ఏడాది జనవరి 1, సంక్రాంతి పండగను పురస్కరించుకొని 12వ తేదీ నుంచి గత 4 రోజులుగా మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. గుంటూరు, పల్నాడు జిల్లాలలో మద్యం అమ్మకాలు వరదలై పారాయి. దీంతో ఎక్సైజ్ ఖజానాకు కోట్లలో ఆదాయం చేకూరింది. లంక ప్రాంతాల్లో, కరకట్ట మొదలుకొని చివరి వరకు పెద్ద ఎత్తున కోడి పందేలు, పేకాట బంకినీలు నిర్వహించారు. వేలాదిమంది సందర్శకులు పేకాట ప్రాంతాలకు, కోడి పందేల నిర్వహణ ప్రాంతాలకు వచ్చారు. అక్కడ పెద్ద ఎత్తున స్నేహితులతో కలిసి ఖుషి ఖుషీగా మద్యం తాగారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ ఏడాది న్యూ ఇయర్‌లో మద్యం అమ్మకాలు రూ. 9.93 కోట్ల అమ్మకాలు జరగ్గా, సంక్రాంతి సందర్భంగా మూడు రోజుల పాటు రూ.16.61మద్యం అమ్మకాలు జరిగాయి. గుంటూరు, పల్నాడు జిల్లాలలో పెద్ద ఎత్తున కోడి పందేలు జరిగాయి.





# తెనాలిలో టెన్షన్.. టెన్షన్

- రజక చెరువు కూడలిలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు
- అనుమతి లేదన్న మున్సిపల్ అధికారులు
- తొలగించాలంటూ మరికొందరు
- మంత్రి మనోహర్ చొరవతో సద్దుమణిగిన వివాదం


అంబేడ్కర్ విగ్రహం, తొలగిస్తారన్న ఆలోచనతో అక్కడకు చేరిన ఐతానగర్ వాసులు

తెనాలి(మారీస్‌పేట), జనవరి 15, (ఆంధ్రజ్యోతి): రాత్రికి రాత్రే అంబేడ్కర్ విగ్రహాన్ని ఓ సామాజిక వర్గం ఏర్పాటు చేస్తే, అనుమతి లేకుండా ఏర్పాటు చేశారని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నందున వెంటనే తొలగించాలంటూ మరో సామాజిక వర్గం పట్టుబట్టింది. అటు మున్సిపల్ అధికారులు కూడా అనుమతి లేకుండా ఏర్పాటు చేశారంటూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెనాలి టు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటం, విగ్రహం తొలగించకుండా కాపాడుకునేందుకు తరలి రావాలంటూ చలో తెనాలికి మరికొందరు పిలుపునివ్వటంతో తెనాలిలో టెన్షన్ వాతావరణం ఏర్పడింది. తహసీల్దార్ మండల మెజిస్ట్రేట్ హోదాలో శాంతిభద్రతలకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే దీనిపై మంత్రి మనోహర్ జోక్యం చేసుకోవటంతో టెన్షన్ వాతావరణం సర్దుమణిగింది. తెనాలి రజక చెరువు కూడలిలో గతంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు ఒక పెద్దపాటి దిమ్మెను నిర్మించారు. అయితే అప్పటి నుంచి అక్కడ విగ్రహం మాత్రం పెట్టలేదు. తాజాగా విగ్రహం ఏర్పాటుకు నిర్మాణ కమిటీ సన్నాహాలు చేయటంతో అధికారులు అనుమతి లేకుండా పెట్టవద్దని వారికి ముదుగానే సూచించారు. అయితే తమ దగ్గర అన్ని అనుమతులూ ఉన్నాయంటూ కమిటీ సభ్యులు, మరికొందరు అంబేడ్కర్ అభిమానులు సోమవారం అర్ధరాత్రి హడావుడిగా విగ్రహాన్ని క్రేన్ సాయంతో ఏర్పాటు చేశారు. మంగళవారం మున్సిపల్ అధికారులు విగ్రహాన్ని తొలగించాలని కోరటం, కమిషనర్ శేషన్న వారితో సంప్రదింపులు జరిపినా వారు దానికి అంగీకరించలేదు. తెనాలి పట్టణంలోకి వచ్చే ప్రధాన రహదారి అదే కావటం, రద్దీ ఎక్కువగా ఉండే రోడ్డు కావటంతో ఎక్కువ విస్తీర్ణంలో కట్టిన దిమ్మెను తొలగించి విగ్రహం ఏర్పాటు చేసేందుకు కావాల్సినంత దిమ్మెను నిర్మించుకోవాలని, లేదంటే పూర్తిగా దిమ్మెను తొలగించేస్తే, మేమే మరోచోట విగ్రహ నిర్మాణం చేయించుతామనే హామీలిచ్చినా వారు మాత్రం తొలగించటానికి వీలులేదని భీష్మించారు. అయితే అక్కడే ఉన్న మరో సామాజికవర్గం ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా తొలగించాలని కోరటంతో మరింత వేడెక్కింది. ఇరువర్గాలు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి విన్నవించారు. అయితే విగ్రహం తొలగించటం మా అభిమతం కాదనీ, అంబేడ్కర్ విగ్రహం తొలగింపు విషయంలో వస్తున్న ప్రచారాన్ని నమ్మాల్సిన పనిలేదనీ, ఎవరూ ఆందోళన పడాల్సిన పనిలేదని తేల్చిచెప్పటంతో వారంతా శాంతించారు. అయితే విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులంతా డీఎస్పీ జనార్ధనరావు, తహసీల్దార్ గోపాలకృష్ణ, కమిషనర్ శేషన్న, ఇతర అధికారుల సమక్షంలో సమావేశమై మాకు నమ్మకం కలిగిందనీ, ఎటువంటి ఆందోళన ఉండదని పేర్కొన్నారు. శాశ్వత విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని, రజక చెరువులో కొంత విస్తీర్ణాన్ని అంబేడ్కర్ లైబ్రరీ, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేటాయించాలని కోరారు. ఇదిలా ఉంటే అంబేడ్కర్ విగ్రహాన్ని కాపాడుకునేందుకు అందరూ తెనాలి తరలిరావాలంటూ చలో తెనాలికి పిలుపునివ్వటం చర్చనీయాంశమైంది. అధికార పార్టీ నాయకుడు, న్యాయవాది హరిదాసు గౌరీశంకర్, మరికొందరు నాయకులు కూడా తాము విగ్రహ ఏర్పాటుకు వ్యతిరేకం కాదని, దీనిని కావాలనే కొందరు బయటి వ్యక్తులు ప్రవేశించి గొడవలు సృష్టించేందుకు కుట్ర చేశారని, ఆ కుట్రను నిర్మాణ కమిటీ నమ్మకుండా ఎటువంటి అలజడులు లేకుండా తెనాలిలో శాంతియుత వాతావరణానికి సహకరించటం గొప్ప విషయమని పేర్కొన్నారు.

## పుకార్లను నమ్మవద్దు

అంబేడ్కర్ విగ్రహాన్ని మున్సిపల్ అధికారులు తొలగిస్తారంటూ వస్తున్న పుకార్లలో ఏమాత్రం వాస్తవం లేదనీ, కేవలం ప్రజల్లో అలజడి రేపేందుకు కొందరు చేస్తున్న ప్రచారం మాత్రమేనని పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న అన్నారు. బుధవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ శేషన్న, తహసీల్దార్ గోపాలకృష్ణ, డీఎస్పీ జనార్దనరావులతో కలసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని అయినా ప్రజల్లో ఆ విగ్రహం తొలగిస్తారనే అపోహలు నెలకొనడంతో విగ్రహ నిర్మాణ సభ్యులు ఆందోళనలు చేపట్టారని చెప్పారు. విగ్రహంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడానికి కమిటీ సభ్యులతో చర్చించామని, వారు కూడా సానుకూలంగా స్పందించి విగ్రహం తొలగింపు లేదనే విషయంపై స్పష్టత పొందారని చెప్పారు.

# ప్రైవేటు ట్రావెల్స్ చార్జీల బాదుడు

గుంటూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి కొన్ని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు చార్జీల దోపిడీకి తెరతీశాయి. టిక్కెట్ల కృత్రిమ కొరతను సృష్టించి రోజుకో రేటుతో బాదుడు ప్రారంభించాయి. మూడు రోజుల ముచ్చటైన పండగకు సొంతూళ్లకు వచ్చిన ప్రయాణికులు తిరిగి గమ్యస్థానాలకు చేరుకునేందుకు సిద్ధమయ్యారు. ఉద్యోగ, విద్యా, వ్యాపార ఇతర కార్యకలాపాలతో హైదరాబాద్, చెన్నై, బెంగళూరుతో పాటు ఇతర దూర ప్రాంతాల్లో స్థిర పడిన వారు పండుగకు జిల్లాకు చేరుకున్నారు. మూడు రోజుల పండగ ముగిసిన నేపథ్యంలో తిరుగుపయనం కోసం ఎవరికి వారు ఆర్టీసీ, రైల్వేతో పాటు ప్రైవేటు ట్రావెల్స్ యాజామాన్యాలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే రైల్వేతోపాటు ఆర్టీసీ కూడా అదనపు సర్వీసులను ఏర్పాటు చేసింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రైల్వేలో టిక్కెట్లు దొరకకపోవటం, ఆర్టీసీలో కూడా అంతంతమాత్రంగా ఉండటంతో కొందరు ప్రయాణికులు ప్రైవేటు ట్రావెల్స్‌లో తిరుగు ప్రయాణం చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ఆర్టీసీ ఈ దఫా పండగకు స్పెషల్ సర్వీసులకు కూడా సాధారణ చార్జీలనే వసూలు చేస్తున్నారు. ఆర్టీసీలో గుంటూరు నుంచి కేపీహెచ్‌బీకి సాధారణ నాన్ ఏసీకి రూ. 540, ఇంద్ర ఏసీకి రూ. 870 కాగా అమరావతి ఏసీకి రూ. 700 వసూలు చేస్తున్నారు. ఇక గుంటూరు నుంచి చెన్నైకి సూపర్ లగ్జరీ నాన్ ఏసీ సర్వీసుకు రూ. 760, కాగా గుంటూరు నుంచి బెంగళూరుకు నాన్ ఏసీ సూపర్ లగ్జరీకి రూ. 1150, అమరావతి ఏసీకి 1850, ఇంద్ర ఏసీకి రూ. 1460 చార్జీ వసూలు చేస్తున్నారు. పండగ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని కొన్ని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు టిక్కెట్ చార్జీల దోపిడీ చేస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుంటూరు నుంచి హైదరాబాద్‌కు సాధారణ నాన్ ఏసీ అయితే రూ. 700ల నుంచి పైనే వసూలు చేస్తున్నారు. ఏసీ సర్వీసు అయితే రూ. వెయ్యి పైనే వసూలు చేస్తున్నారు. ఇక బెర్త్ అటువంటివి అయితే రూ. 2వేలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గుంటూరు నుంచి చెన్నైకు కూడా రూ. వెయ్యిపైనే చార్జీలు వసూలు చేస్తున్నారు. బెంగళూరుకు కూడా రూ. 3వేల వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## డిమాండ్‌ను బట్టి రోజుకో రేటు

పండగ ముగిసిన రోజు బుధవారం రాత్రి టిక్కెట్ చార్జీల ధర ఒకలా ఉంటే మరుసటి రోజు గురువారం రాత్రి చార్జీల ధర మరోలా ఉంటుంది. కనుమ రోజే తిరుగు ప్రయాణమయ్యేందుకు అత్యవసరమైన వారు తప్ప అత్యధికశాతం మంది పెద్దగా ఆసక్తి చూపటం లేదు. గురువారం రాత్రి నుంచి తిరుగు ప్రయాణమయ్యేందుకు అత్యధిక శాతం మంది సిద్ధమవుతున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న కొన్ని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు ముందుగానే టిక్కెట్లు బుక్ అయిపోయినట్లు కృత్రిమ కొరతను సృష్టించి టిక్కెట్ చార్జీలను అమాంతం పెంచేసి ప్రజల నుంచి చార్జీల దోపిడీ చేస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఆర్టీఏ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి సామాన్య ప్రయాణికులకు టిక్కెట్ చార్జీలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలి.

# నడికుడిలో దొంగల బీభత్సం

- సీసీ కెమెరాలు పగులగొట్టి ఇంట్లో చోరీ
- లక్షల విలువైన బంగారం, నగదు అపహరణ

దాచేపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలు జరిగిన సంఘటన బుధవారం దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నడికుడిలో సాయిబాబా గుడి సమీపంలో రెండిళ్లలో, మరోచోట మెయిన్‌బజారులో ఉన్న మరో మూడిళ్లలో, పొందుగల గ్రామ పంచాయతీ శివారు శ్రీని వాసపురంలో రెండు ఇళ్లల్లో చోరీలు జరిగాయి. బాధితులంతా పండుగకు ఊరెళ్లారు. తాళాలు వేసిన ఇంటిని లక్ష్యంగా చేసుకొని చోరీలు జరిగాయి. నడికూడి గ్రామంలోని సాయిబాబా గుడి వద్ద కేళావత్ బాలాజీనాయక్ ముగ్గుమిల్లు వ్యాపారి. కుటుంబసభ్యులతో కలిసి మాచర్ల సమీ పంలోని కొత్తపుల్లారెడ్డిగూడెం వెళ్లారు. అతని ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాలను పగులగొట్టి ఇంటి లోపల వున్న సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌ను కూడా దొంగలు తీసుకెళ్లారు. ఇంట్లోని విలువైన బంగారం, నగదు, ఇతర విలువైన వస్తువులను తీసుకెళ్లారు. బాలాజీనాయక్ ఇంటికి వేసిన తాళాలను పగులగొట్టి దొంగలు తమదగ్గర వున్న తాళాలు ఆ ఇంటికి వేశారు. బాలాజీనాయక్ ఇంటిపక్కన ఉన్న షేక్ రహీం కుటుంబసభ్యులు కూడా హైదరాబాద్ వెళ్లారు. ఆ ఇంట్లో బీరువా పగులగొట్టి వెండి వస్తువులు, విలువైన సామాన్లు చోరీకి గురైనట్లు బాధితులు వివరించారు. నడికూడిలోని మెయిన్ సెంటర్‌లో ఉన్న సయ్యద్ పెద్దసైదా, రైల్వే ఉద్యోగి అప్పారావు ఇళ్లల్లో కూడా చోరీ జరిగింది. శ్రీనివాసపురం గ్రామంలో హరిదాసు రామకృష్ణ, యేపూరి నరసమ్మ ఇంటికి తాళాలు వేసి వుండగా తాళాలు పగులగొట్టి చోరీ చేసినట్లు స్థానికులు పేర్కొన్నారు. శ్రీనివాసపురంలో మరో ఒకటి, రెండు ఇళ్లల్లో చోరీకి ప్రయత్నం చేయగా ఆ ఇంట్లో వున్న వ్యక్తులు లైట్లు వేసి ఎవరు అంటూ పెద్దగా కేకలు వేయడంతో దొంగలు పరారయ్యారు.

# అనుమానాస్పద స్థితిలో బావ, బావమరిది మృతి

- కల్తీ మద్యమే కారణమా?

అచ్చంపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన అచ్చంపేట పంచాయతీ పరిధిలోని చామ్రు బీసీ కాలనీలో మంగళవారం రాత్రి పెనువిషాదం సంభవించింది. చామ్రుకి చెందిన గౌతుకట్ల కోటయ్య అనారోగ్యంతో మృతి చెందగా, మంగళవారం కోటయ్య అంత్యక్రియలు జరిగాయి. దహన సంస్కారాల అనంతరం కోటయ్య పెద్దకుమారుడు గౌతు కట్ల నాగేశ్వరరావు(45), అతని బావమరిది తెల్లమేకల నాగేశ్వరరావు(36) వాంతులు, విరోచనాలు అయ్యాయి. ఒకరి తర్వాత మరొకకు గంటల వ్యవధిలోనే మంగళవారం రాత్రి మృతి చెందారు. దహనసంస్కారాల సమయంలో వీరిద్దరూ మద్యం తాగినట్లు తెలిసింది. కల్తీ మద్యం కారణంగా మృతి చెంది ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. మృతుడు గౌతుకట్ల నాగేశ్వరరావుకు భార్య వెంకాయమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. తెల్లమేకల నాగేశ్వరరావు ఎన్‌టీఆర్ జిల్లా చందచర్లపాడు మండలం రామన్నపేటకి చెందిన వాడు. ఇతనికి భార్య పద్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చామ్రులో పెద్దల సమక్షంలో శవపంచనామా నిర్వహించినట్టు వీఆర్‌వో బాలూనాయక్ తెలిపారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వెంకటప్రసాదు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి విలేఖరి ఆత్మహత్య

గుంటూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రమౌళినగర్‌లో షైహోమ్స్ అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి కోలుకొండ శ్రీకర్(55) ఆత్మహత్య చేసుకున్నాడు. తురకపాలెం గ్రామ పరిధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న శ్రీకర్ ఓ దినపత్రికలో రిపోర్టర్‌గా పని చేస్తున్నారు. గతంలో ఆయన తమ్ముడు ఇదే విధంగా ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇటీవల ఆయన తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. దీనికితోడు ఆర్థిక ఇబ్బందులు కూడా ఉన్నాయి. దీంతో శ్రీకర్ తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయ్యాడు. బుధవారం ఉదయం తన తండ్రి అస్థికలు కృష్ణానదిలో కలుపుతానని చెప్పి ఉదయం 9.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వచ్చాడు. అయితే మధ్యాహ్నం సమయంలో బృందావన్ గార్డెన్స్ నుంచి ఐటీసీ హోటల్‌కు వెళ్లే దారిలోని షై హోమ్స్ అపార్ట్‌మెంట్ పై అంతస్తుకు వెళ్లి అక్కడ నుంచి కిందకు దూకేశాడు. కిందపడిన శ్రీకర్ అక్కడిక్కడే మృతి చెందాడు. శ్రీకర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 138,147,158 |
| చికెన్ విత్ స్కిన్ | 264.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 274.00 |

## హోరాహోరీగా జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు

ఈపూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో రైతుమిత్ర కబడ్డీ కమిటీ ఆధ్వర్యంలో జరగుతున్న జాతీయస్థాయి కబడ్డీ పోటీలు నాలుగో రోజు బుధవారం రసవత్తరంగా సాగాయి. పోటీల్లో పలు రాష్ట్రాల నుంచి వచ్చిన జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఎస్‌వీఎస్ జట్టుపై హర్యాణా, జార్ఖండ్ జట్టుపై ఇండియా నేవి, సత్తెనపల్లి జట్టుపై ఏపీ స్పై, ఆంధ్రాపై కర్ణాటక, రావిపాడుపై ఇండియా నేవి జట్లు విజయం సాధించాయి. తల్లపనేని రామారావు, సూరే కోటేశ్వరరావు పోటీలను పరిశీలించారు.

## అర్ధరాత్రి దొంగలు హల్‌చల్

- ఒకే రోజు 8 గృహాల్లో చోరీ
- పండుగపూట దొంగతనాలతో ప్రజలు బెంబేలు

గురజాలటౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పండుగపూట.. ఒకే రోజు వరుస దొంగతనాలతో దుండగులు హడలెత్తించారు.. తాళాలు వేసి ఉన్న గృహాలను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడ్డారు. సంక్రాంతి పండుగ రోజైన మంగళవారం అర్ధరాత్రి దొంగలు గురజాల పట్టణంలో 2, మండలంలోని పులిపాడులో 6 గృహాల్లో చోరీలకు పాల్పడ్డారు. పండుగకు తమ గ్రామాలకు, పట్టణాలకు వెళ్లిన వారి గృహాలను లక్ష్యంగా చేసుకొని ఆయా గృహాల్లో చోరీలకు పాల్పడ్డారు. గృహాల్లోని బీరువాలను పగులకొట్టి భారీగా నగదు, వెండి అపహరించారు. గృహాల్లోని సీసీ కెమెరాలను సైతం దుండగులు ధ్వంసం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు చోరీకి గురైన గృహాల వద్దకు చేరుకొని క్లూస్‌టీం సహాయంతో వివరాలు సేకరించారు. చోరీకి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. పండుగపూట వరుస దొంగతనాలతో మండల ప్రజలు బెంబెలెత్తిపోతున్నారు.

### సబ్ డివిజన్ పరిధిలో 15 గృహాల్లో చోరీ : డీఎస్పీ జగదీష్



గురజాల సబ్‌డివిజన్ పరిధిలో మంగళవారం రాత్రి 15 గృహాల్లో చోరీ జరిగినట్లు డీఎస్పీ జగదీష్ తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళవారం రాత్రి దాచేపల్లి, గురజాల పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాల్లో వరుస దొంగతనాలు జరిగాయన్నారు. సుమారు 15 గృహాల్లో దుండగులు చోరీ చేశారన్నారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సిబ్బంది పలు బృందాలుగా ఏర్పాటు చేసి విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. సంక్రాంతి పండుగకు ఊర్లకు వెళ్లిన వారి గృహాల్లో చోరీలు జరిగాయన్నారు. ప్రజలు పోలీస్ లాక్ మానిటరింగ్ సిస్టంను వినియోగించుకోవాలని, దీని ద్వారా గృహాల్లో లేని సమయంలో పోలీసు నిఘా ఏర్పాటు ఆస్తులను రక్షిస్తామని, దొంగతనాలను అరికడతామని డీఎస్పీ తెలిపారు.

## గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

పెదకాకాని, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండల పరిధిలోని తక్కెళ్ళపాడు గ్రామం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు బుధవారం పెదకాకాని పోలీసులు తెలిపారు. తక్కెళ్ళపాడు పంపు హౌస్ రోడ్డులోని కొమ్మూరి శ్రీనివాసరావు పశువుల చావడి వద్ద గల చెట్టుకు గుర్తుతెలియని సుమారు 65 సంవత్సరాల వ్యక్తి ఉరి వేసుకుని వేలడుతూ ఉండగా, అక్కడ వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసిన వారు పెదకాకాని సీఐ 8688831350, ఎస్సై 8688831352 సమాచారం ఇవ్వాల్సిందిగా పోలీసులు కోరారు.

## యువకుల ఘర్షణ

పొన్నూరుటౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కోడిపందేల విషయంలో చెలరేగిన వివాదం యువకుల మధ్య ఘర్షణకు దారి తీసింది. పొన్నూరు మండలం వెల్లలూరు గ్రామ శివారు బాపట్ల జిల్లా, చుండూరు సమీపంలో సంక్రాంతి సందర్భంగా కోడిపందేల బరి ఏర్పాటు చేశారు. అక్కడ జరిగిన కొద్దిపాటి ఘర్షణ నేపథ్యంలో గుంటూరుకు చెందిన యువకులు స్థానిక యువకులతో ఘర్షణకు దిగారు. ఘర్షణ అనంతరం యువకులు అక్కడ నుంచి వెళ్లిపోయే క్రమంలో పొన్నూరు మండలం బ్రహ్మణకోడూరు అడ్డరోడ్డు వద్దకు చేరుకున్నారు. అక్కడ మళ్లీ ఘర్షణకు దిగారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ క్రమంలో గుంటూరు యువకులు కారులో పరారైయ్యారు. స్థానికులు బుడంపాడు వరకు వెంబడించారు. కాగా యువకుల ఘర్షణపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు. ఈ దాడిలో గుంటూరుకు చెందిన యువకుల కారు అద్దాలు పూర్తిగా ధ్వంసం అయినట్లు సమాచారం.

## రేపటి నుంచి ఎన్టీఆర్ కళా పరిషత్ నాటకోత్సవాలు

గుంటూరు (తూర్పు), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం, అన్నమయ్య కళావేదికపై కె.ఆర్.కె. ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కళాపరిషత్ నిర్వహణలో 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్టు సంస్థ నిర్వాహకులు కాట్రగడ్డ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 17న నిశ్శబ్దమా నీ ఖరీదెంత, ఇంద్రప్రస్థ, 18న వర్క్ ఫ్రమ్ హోం, 19న చిగురు మేఘం, 20న జేబు చెప్పిన ఊసులు సాంఘిక నాటిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. అంతేగాక వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, సినీ నిర్మాతలు కాట్రగడ్డ ప్రసాదు, అట్లూరి నారాయణరావులను ఎన్టీఆర్ ఆత్మీయ పురస్కారాలతో సత్కరిస్తామని అన్నారు. కార్యక్రమాలకు ముఖ్యఅతిథిలుగా ఘంటా పున్నారావు, మహమద్ రఫీ, భాష్యం రామకృష్ణ, వీపీ శంకరరావు, అంబటి మధు మోహనకృష్ణ, తిలక్‌బాబు, కల్చరల్ కమిషన్ చైర్‌పర్సన్ తేజస్విని హాజరౌతున్నట్టు తెలిపారు.

## పులిచింతల సమాచారం

అచ్చంపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 37.72 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కులు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

## గుల్జారీలాల్ నందా జీవితం ఆదర్శనీయం

గుంటూరు సిటీ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): భారత దేశానికి రెండు సార్లు ప్రధానిగా పని చేసిన గుల్జారీలాల్ నందా జీవితం అందరికీ ఆదర్శనీయం అని అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు అన్నారు. మాజీ ప్రధాని గుల్జారీలాల్ నందా వర్ధంతి సందర్భంగా బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నసీర్

## డాక్టర్ ముస్తఫా మృతి బాధాకరం ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని ప్రముఖ ఛాతి వైద్య నిపుణుడు డాక్టర్ ముస్తఫా మరణం అత్యంత బాధాకరమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. ముస్తఫా పార్థివ దేహాన్ని ఆయన మంగళవారం సందర్శించి నివాళులర్పించారు. ముస్తఫా కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. డాక్టర్ ముస్తఫా మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, కోవిడ్ సమయంలో ఆయన ప్రజలకు చేసిన వైద్య సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని గుర్తు చేశారు. ముస్తఫా మరణంతో వైద్యరంగంలో ఒక గొప్ప నిపుణుడిని కోల్పోయామని అన్నారు

## విజేతలకు బహుమతులు

గుంటూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): గుంటూరు పట్టణ ఫ్యాన్సీ, స్టేషనరీ జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాగార్జున యూనివర్శిటీ వద్దనున్న శ్రీ దశావతార వెంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో ధనుర్మాస వన సమారాధన, 32 మంది దంపతులతో కల్యాణములు, సంక్రాంతి సంబరాలు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ను అధ్యక్షుడు జుజ్జూరు శేష ప్రభాకర్, రామ కృష్ణ సన్మానించారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్, చాంబర్ ఆఫ్ కామర్స్ శాశ్వత గౌరవ అధ్యక్షుడు ఆతు కూరి ఆంజనేయులు, అధ్యక్షులు యేల్చూరి వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్ (బస్ బాబు) తదితరులు పాల్గొన్నారు.

## కేసులు ఉపసంహరించి పెన్షన్ మంజూరుకు వినతి

గుంటూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మాదిరిగా రాష్ట్రంలో కూడా వివిధ కేసుల్లో పదేళ్లకు పైబడి విచారణలోనే మగ్గిపోతూ పెండింగ్ జాబితాలో ఉన్న వేలాది రిటైర్డ్ ఉద్యోగుల కేసులను ఉపసంహరించి పెన్షన్ మంజూరు చేయాలని రాష్ట్ర పెన్షనర్ల చర్చా వేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో కోరారు. ఆ మేరకు ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా వివిధ కోర్టులలో పదేళ్ళకు పైగా విచారణలోనే మగ్గిపోతున్న కేసులను ఉపసంహరించాలని సిబ్బంది, శిక్షణా విభాగం కార్యాచరణ రూపొందించిందని తెలిపారు. ఈ విధానాన్ని రాష్ట్రంలో కూడా అనుసరించి పదేళ్ళ కాల వ్యవధి ముగిసిన కేసులను ఉపసంహరించి పెన్షన్ మంజూరు చేయాలని కోర్టులలో ఎటువంటి కేసులు లేకపోయినా డిపార్ట్‌మెంట్ విచారణ పూర్తికాక 10, 15 ఏళ్ళ నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరిగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనేక జిల్లాల్లో 17 ఏళ్ళకు పైబడిన కేసులు కూడా ఇంకా కాల్ వర్క్ స్టేజ్‌లోనే ఉన్నాయని, మానవీయకోణంలో ఆలోచించి పరిష్కరించాలని కోరారు.

## మటన్, చికెన్ స్టాల్స్‌లో క్యూ

గుంటూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల ముచ్చటైన సంక్రాంతి పండుగకు చివరి రోజైన కనుమకు మాంసాహారం తినేందుకు నగర వాసులు ప్రత్యేక ఆసక్తి చూపారు. జిల్లా కేంద్రం గుంటూరు నగరంలో తెల్లవారుజాము నుంచే మటన్, చికెన్ స్టాల్స్ ఎదుట మాంసాహార ప్రియులు కొనుగోళ్ళు చేసేందుకు క్యూ కట్టారు. నగరంలోని ప్రధాన ప్రాంతాలైన మార్కెట్ సెంటర్, పాత గుంటూరు,కొత్తపేట, అమరావతి రోడ్డు, నగరంపాలెం, జీటీ రోడ్డు, చుట్టుగుంట సెంటర్, గుజ్జనగుండ్ల సెంటర్‌లలో మటన్, చికెన్ స్టాల్స్ కొనుగోలుదారులతో కోలాహల వాతావరణం నెలకొన్నది. సాధారణ రోజుల్లో మటన్‌కిలో రూ. 900, రూ. 940కు విక్రయించే స్టాల్స్ యజమానులు కనుమ పురస్కరించుకొని మటన్ కిలో రూ. వెయ్యికి విక్రయించారు. ఇక కిలో చికెన్ కూడా రూ. 250 నుంచి రూ. 260ల వరకు ఒక్కో చోట ఒక్కో ధరతో విక్రయాలు జరిపారు. ఇక మటన్, చికెన్‌తో పాటు చేపలు కూడా కొనుగోలు చేశారు.

# అంబరాన్ని తాకిన సంక్రాంతి సంబరాలు

- ఘనంగా ముగిసిన వేడుకలు
- తరలివచ్చిన టీడీపీ నేతలు
- పోటాపోటీగా సాంస్కృతిక ప్రదర్శనలు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 15( ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ మునిసిపల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకతాయి. ఈ సంబరాలు బుధవారంతో ముగిశాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం గంగిరెద్దులు, ఎద్దుల ప్రదర్శనలు, వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, కర్రసాము, కోలాటం (మహిళలు, పురుషులు), స్టార్ మ్యూజికల్ నైట్, కాంతారా యాక్ట్, జగలర్స్ షో, బటర్ ఫ్లై, రోబో యాక్ట్ ప్రదర్శనలతో ఎన్టీఆర్ స్టేడియం గ్రామీణ వాతావరణ శోభతో అలరారింది. సంబరాల్లో చివరి రోజైన బుధవారం కనుమ పండుగరోజు గాలిపటాలు ఎగరేయడం, ప్రాసమణి గారి ప్రోగ్రామ్, మ్యాజిక్ షో(ఇల్యూజన్ షో), క్లాసికల్, ఫోక్ డ్యాన్స్(ఖలీల్), వాసవి ఆర్కెస్ట్రా ప్రదర్శనలను హాజరైన ప్రజలు ఉత్సాహంతో తిలకించారు. సంబరాలను హాజరైన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు మాట్లాడుతూ నగరాల్లో నివసించే ప్రతి ఒక్కరీ మూలాలు గ్రామాలతో ముడిపడి ఉంటాయని, రైతులు సంతోషంగా ఉంటేనే సమాజం సంతోషంగా ఉంటుందన్నారు. ఈ ఏడాది వర్షాలు కురిసి పంటలు బాగా పండాయని, పండిన పంటలకు తగిన గిట్టుబాటు ధర అంది రైతుల ఇంట క్రాంతి ఈ సంక్రాంతి ఇవ్వాలని ఆకాంక్షించారు. సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గుంటూరు నగరంలో సంప్రదాయ సంక్రాంతి సంబరాల ద్వారా నగర వాసులను అలరించడానికి జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు కృషి అభినందనీయమన్నారు. గతంలో తాము పశ్చిమ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కూడా సంబరాలు ఘనంగా నిర్వహించామని, ప్రస్తుతం తిరిగి ఆవిధంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ చాలా ఏళ్ల అనంతరం నగర ప్రజలందరినీ అలరించేలా కూటమి ప్రభుత్వ హయాంలో సంక్రాంతి సంబరాలు జరుగుతున్నాయన్నారు. సంక్రాంతి అంటేనే ప్రతి ఇంట ఆనంద క్రాంతి వెల్లివిరియడమని, ఇటువంటి సంబరాలు ప్రతి ఏడాది జరగాలని కోరారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంబరాల్లో పాల్గొని ఆనందించేలా వివిధ కళారూపాలు, ప్రదర్శనలు ఉన్నాయన్నారు. సంబరాల్లో ప్రతి రోజు వయస్సుతో సంబంధం లేకుండా వేల మంది ప్రజలు హాజరై ఆనందించారన్నారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ తెలుగు సంస్కృతీసాంప్రదాయాలను సంక్రాంతి సంబరాల ద్వారా నేటి తరానికి అందించడం అభినందనీయమన్నారు. సంబరాల నిర్వహణలో నగర కమిషనర్, ఆర్గనైజింగ్ కమిటి, అధికారులు, కార్మికులు విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ఎస్.ఈ. నాగమల్లేశ్వరరావు, సిఎంఓహెచ్ డాక్టర్ అమృత, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు ఈ.వరప్రసాద్, కె.కోటేశ్వరరావు, వి.పద్మజ, బాలాజీ, మీరావలి, చిస్టి, నిర్వహణ కమిటి సభ్యులు డి.శ్రీనివాసరావు, విజయలక్ష్మి, కాశయ్య, నసీర్ అహ్మద్, లోకేశ్వరరావు, ఉషారాణి, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన సంక్రాంతి సంబరాలలో పాల్గొన్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనందబాబు, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు తదితరులు





సంక్రాంతి సంబరాల్లో అలరించిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు..



సంక్రాంతికి ఒకే చోటకు చేరిన కుటుంబసభ్యులు

## కుటుంబాలంతా కలిసి సంక్రాంతి సంబరాలు

- గల్ఫ్, ఇతర రాష్ట్రాల నుంచి ఒకే చోటకు చేరిన కుటుంబాలు

గుంటూరు, జనవరి 15(ఆంధ్ర జ్యోతి): వారంతా పది కుటుం బాల సభ్యులు. సంక్రాంతి పండు గను అంతా కలిసి జరుపుకునేం దుకు నెల రోజులు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. గల్ఫ్‌తో పాటు హైదరాబాద్ వంటి ప్రాంతాల నుంచి ఒకే చోటకు చేరి సంక్రాంతి సంబ రాలు జరుపుకున్నారు. గుంటూరు జిల్లా నంబూరుకి చెందిన భీమ వరపు నాగిరెడ్డి కుటుంబం ప్రతి ఏడాది సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకుంటుంది. వివిధ వృత్తుల్లో స్థిరపడ్డ అన్నదమ్ములు, వారి పిల్లలు, మనమలు, మనుమరాళ్ళతో కలిసి ఒకే చోటికి చేరుకున్నారు. గల్ఫ్‌లోని షార్జా, హైదరాబాద్ తో పాటు ఇతర దూర ప్రాంతాల నుంచి పది కుటుంబాల నుంచి 30 మంది తరలి వచ్చారు. పిండివంటలు వండుకుంటూ సం తోషంగా గడిపారు. ఆటాపాటలతో మూడు రోజులు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ 2016 నుంచి ఇదే ఉత్సాహంతో ఈ పండుగను నిర్వహిస్తున్నామన్నారు. పిల్లలకు కుటుంబ సంబంధాలు, ప్రేమలు, అనుబంధాలు, మన సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేసేలా జరుపు కుంటున్నామన్నారు. భవిష్యత్తులోనూ ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తామన్నారు.

## బోసిపోయిన నగర రహదారులు

గుంటూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు నగర వాసులు అధిక శాతం తమ సొంతూళ్ళకు వెళ్ళడంతో గుంటూరులోని ప్రధాన రహదారులు ప్రజల రాక పోకల్లేక బుధవారం బోసిపోయాయి. నగరంలో ప్రధాన రహదారులైన లక్ష్మీపురం మెయిన్ రోడ్డు, బ్రాడీపేట మెయిన్ రోడ్డు, గుజ్జనగుండ్ల రోడ్డు, కలెక్టరేట్ రోడ్లలో జన సంచారం లేక వెలవెలబోయినట్లు కనిపించాయి. నిత్యం పెద్ద ఎత్తున వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ అంతరాయాలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి చేసే ప్రధాన రహదారులు సైతం బోసిపోవడంతో ట్రాఫిక్ పోలీసులు కూడా ఊపిరిపీల్చుకున్నారు. బుధవారం ప్రధాన దుకాణాలు కూడా తెరుచుకోలేదు. మొత్తానికి నగరంలో ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌పై సంక్రాంతి ప్రభావం కొట్టొచ్చినట్లు కనిపించింది.



జన సంచారం లేక వెలవెలబోతున్న ప్రధాన రహదారి

## భక్తి శ్రద్ధలతో మకరజ్యోతి దర్శనం

గుంటూరు(తూర్పు), జనవరి15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినం సందర్భంగా మంగళవారం వివిధ ఆలయాల్లో మకరజ్యోతి దర్శన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్వంజీ, బ్రహ్మజ్ఞానానంద సరస్వతి స్వామి పాల్గొని మకర జ్యోతి వెలిగించి భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. తొలుత మకర సంక్రాతి సందర్భంగా గంగిరెద్దుల విన్యాసాలు, విశేష అభిషేక కార్యక్రమం జరిగింది. జొన్నలగడ్డ సత్యనారాయణ, లలితాంబ దంపతులు ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బీఉమా మహేశ్వరరావు పర్యవేక్షించారు.

● స్థానిక ఏలూరు బజారు, కోదండ రామాలయం వద్ద వాసవీ మణికంఠ సేవా భక్త బృందం ఆధ్వర్యంలో మకరజ్యోతి దర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని మకరజ్యోతిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తడికమళ్ల మణికంఠ, నాళం శివప్రసాదు, పొదర్తి ఉమా, ఎల్ ఐ సీ రవి తదితరులు పాల్గొన్నారు.

### అరండల్ పేట శివాలయంలో..

గుంటూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప సేవా సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేట నాల్గో లైన్‌లని శివాలయంలో సమాఖ్య అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ ఆధ్వర్యంలో ఘనంగా మకర జ్యోతి దర్శనం జరిగింది. సిరిపురపు స్వరాజ్యలక్ష్మి మకర జ్యోతిని వెలిగించారు. ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో కూడా మకర జ్యోతి దర్శనం కార్యక్రమం జరిగింది. తొలుత ఉత్తరా నక్షత్ర దర్శనం, తర్వాత జ్యోతి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం పూట శ్రీ ధర్మశాస్త్ర హోమ కార్యక్రమం పూర్ణాహుతి, సాయంత్రం మకరజ్యోతి, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిరిపురపు శ్రీధర్, ఆలయ ధర్మకర్త ఏకా ప్రసాద్, ప్రధాన అర్చకుడు కుందుర్తి భాస్కర్ శర్మ, మన్నవ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మకరజ్యోతి వెలిగిస్తున్న శ్రీధర్ దంపతులు

## మాజీ ఎమ్మెల్యే శంకరరావు కార్యాలయం వద్ద ఘర్షణ ఘటనపై ఇరువర్గాలపై కేసులు

గుంటూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్డు వద్ద ఉన్న పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కార్యాలయం వద్ద జరిగిన ఘర్షణ ఉదంతంపై ఇరు వార్గలపై కేసులు నమోదయ్యాయి. ఈ నెల 13న సాయంత్రం జరిగిన ఈ ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని కంభంపాడుకి చెందిన వైసీపీ కార్యకర్త తిరుపతయ్య ఆదివారం సాయంత్రం మద్యం సేవించి టీడీపీ కార్య కర్తలకు ఫోన్ చేసి 'దమ్మంటే చూసుకుందాం రండి రా.. నేను గుంటూరులో ఉన్నాను' అంటూ సవాల్ విసిరాడు. గతంలో గ్రామంలో టీడీపీ, వైసీపీ, వర్గాల మధ్య పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తిరుపతయ్య టీడీపీ కార్యకర్తలకు ఫోన్ చేశాడు. అయితే, ఆ సమయంలో లేమల్లెలో కోడిపందేల వద్ద ఉన్న టీడీపీ కార్యకర్తలు అక్కడి నుంచి గుంటూరు వచ్చారు. తొలుత ఎంపీ శ్రీకృష్ణదేవ రాయుల కార్యాలయం వద్ద ఉన్నానని చెప్పడంతో వారు అక్కడికి వెళ్లారు. ఆ తరువాత మాజీ ఎమ్మెల్యే శంకరరావు కార్యాలయం వద్ద ఉన్నానని చెప్పాడు. దీంతో, రెండు ద్విచక్ర వాహనాల్లో వారు అక్కడికి వెళ్లారు. తిరుపతయ్య ఆచూకీ లభించలేదు. దీంతో, తిరుపతయ్యకు వారు ఫోన్ చేయగా, లిఫ్ట్ చేయలేదు. టీడీపీ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఉన్న వైసీపీ ఫ్లెక్సీలను చించి వేశారు. అక్కడే ఉన్న శంకరరావు కార్యాలయ సూపర్‌వైజర్ నరేంద్ర, కట్టిపోగు జగదీష్ మరికొందరు టీడీపీ వర్గీయులపై తిరగబడ్డారు. దీంతో, ఈ వ్యవహారం ఘర్షణకు దారి తీసింది. ఇరువర్గాలు పరస్పరం కొట్టుకోవడంతో గాయాలయ్యాయి.. ఈ ఘటనపై నల్లపాడు పోలీసులు కంభంపాడుకు చెందిన టీడీపీ కార్యకర్తలు చిరుమామిళ్ళ కృష్ణప్రసాద్, పెండ్యాల ప్రణయ్, మోదేపల్లి దుర్గ, కొండ్రు ప్రవీణ్, రాళ్ళపల్లి నవీన్, సతీష్‌లపైనా, వైసీపీకి చెందిన అక్బర్, జగదీష్,చైతన్య, శ్రీను, నరేంద్ర తదితరులపైనా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జీఎంసీ కమిషనర్ వ్యవహార శైలి బాధాకరం

- మేయర్ మనోహర్ నాయుడు
- నగర ప్రథమ పౌరుడికి ఇచ్చే గౌరవమిదేనా?
- పులి శ్రీనివాసులు వ్యవహరిస్తున్న తీరు ఏకపక్షం
- 17న కౌన్సిల్ సమావేశం నిర్వహించమన్నా పట్టించుకోరే?

గుంటూరు కార్పొరేషన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు వ్యవహార శైలి అత్యంత బాధాకరంగా ఉందని నగర మేయర్ మనోహర్ నాయుడు ధ్వజమెత్తారు. నగర ప్రథమ పౌరుడిగా ఉన్న తనకు ఇచ్చే గౌరవం ఇదేనా? అంటూ కమిషనర్‌కు రాసిన లేఖలో అంశాలను బుధవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. పులి శ్రీనివాసులు వ్యవహరిస్తున్న తీరు ఏకపక్షంగా, అధికార పార్టీకి అనుకూలంగా ఉంటోందన్నారు. ఈ నెల 17న కౌన్సిల్ సమావేశాన్ని తిరిగి నిర్వహించాలని కోరుతూ ఈ నెల ఏడవ తేదీన కమిషనర్‌కు లేఖ పంపినప్పటికీ ఆయన స్పందించలేదని పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాల్లో తన పేరును ఎందుకు ప్రస్తావించలేదని, ప్రోటోకాల్ ప్రకారం నగర ప్రథమ పౌరుడు మేయర్ పేరు ఎక్కడ కరపత్రాలలో, ఆహ్వాన పత్రాలలో ముద్రించలేదని పేర్కొన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు సంబంధించిన వాటిలో తన ఫొటో కానీ పేరు కానీ ఎక్కడా ప్రస్తావించలేదని, ప్రోటోకాల్ విషయం 'మీకు తెలియదా?' అని కమిషనర్‌ను ప్రశ్నించారు. 'మీ సొంత ప్రయోజనాల కోసం, నగర అభివృద్ధికి మీరు అవరోధంగా ఉంటున్నారు' అని మేయర్ ఆరోపించారు. కౌన్సిల్ సమావేశం గత నెల 20న, ఈ నెల 4వ న వాయిదా పడ్డాయని, తిరిగి ఆయా సమావేశాలను కొనసాగించాల్సిన బాధ్యత మీపై లేదా?' అని ప్రశ్నించారు.



సక్సెస్ మీట్‌లో మాట్లాడుతున్న దర్శకులు బాబీ, తమన్ తదితరులు

## 'డాకు మహారాజ్' దర్శకుడు, మ్యూజిక్ డైరెక్టర్ సందడి

గుంటూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ చిత్ర దర్శకుడు బాబీ కొల్లి, మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ఎస్ తమన్‌లు గుంటూరులో బుధవారం సందడి చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గుంటూరు విచ్చేసిన వీరిద్దరూ స్థానిక జీటీ రోడ్డులోని పినిక్స్ మాల్‌ను సందర్శించారు. మాల్‌లోని మైత్రి సినిమా థియేటర్‌లో ఈ చిత్రాన్ని కొంచెం సేపు వీక్షించారు. ఈ సందర్భంగా థియేటర్‌కు విచ్చేసిన బాబీ, తమన్‌కు బాలయ్య అభిమానులు ఘన స్వాగతం పలికారు. పూలు చల్లుతూ దర్శకులతో కరచాలనం చేసేందుకు అభిమానులు ఎగబడ్డారు. అనంతరం అభిమానులు, ఫుడ్ కోర్టు యాజమాన్యం దాసరి శ్రీకాంత్, కడంశెట్టి సతీష్, గ్రంధి వెంకటేష్‌ల ఆధ్వర్యంలో బాబీ, తమన్‌లు కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మీడియాతో మాట్లాడుతూ డాకు మహారాజ్ చిత్రం సక్సెస్ కావడం తమకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. డాకు మహారాజ్ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉందన్నారు. చిత్రాన్ని ప్రజలు మరింత ఆదరించాలని కోరారు. అభిమానులకు అభివాదం చేస్తూ సందడి చేశారు. ప్రజలకు, ముఖ్యంగా బాలకృష్ణ అభిమానులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

## అదుపుతప్పిన ద్విచక్రవాహనం.. యువకుడి మృతి

గుంటూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని బుడంపాడు సర్వీస్ రోడ్డులో మద్యం మత్తులో ద్విచక్ర వాహనంపై ఉన్న వ్యక్తి అదుపుతప్పి కాలువలో పడి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఎలా ఉన్నాయి పిడుగురాళ్ల పరిధిలోని జానపాడుకి చెందిన ఇందూరి నరేష్, మక్కెన మహేష్ బాబు, ఐదేళ్లుగా గుంటూరులోని ఏటుకూరు రోడ్డులో ఉన్న సింహపురి వ్వేస్ట్స్‌లో నివసించే వీరు ఈవెంట్స్‌కు వెళ్తుంటారు. గత అర్ధరాత్రి టిఫిన్ చేసేందుకని నరేష్ తన ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న నరేష్ తిరిగి వస్తూ డివైడర్‌ను బలంగా ఢీ కొట్టి పక్కనే ఉన్న కాల్వలోకి దూసుకుపోయాడు. ఈ ఘటనలో నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న నల్లపాడు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి స్నేహితుడు మహేష్ బాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వదిన మృతి

- పొత్తూరు వద్ద ఘటన ● మరిదికి తీవ్ర గాయాలు

గుంటూరు జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పొత్తూరు సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వదిన మృతి చెందగా, మరిది తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పొన్నూరు సమీపంలోని నండూరు వద్ద గల ఇటికంపాడుకి చెందిన దిల్దార్ (55) అనే మహిళ చిలకలూరిపేటలో బంధువుల శుభ కార్యానికి వెళ్ళింది. ఆమెకు మరిది అయిన రేపల్లెకు చెందిన షేక్ కరీమ్ కూడా అదే శుభకార్యానికి వెళ్ళాడు. ద్విచక్రవాహనంపై కరీమ్ తిరుగు ప్రయాణం కాగా, అదే వాహనంపై దిల్దార్ కూడా ఎక్కింది. వారు పొత్తూరు సమీ పానికి రాగానే చిలకలూరిపేట వైపు నుంచి వేగంగా వస్తున్న ఎలక్ట్రిక్ కారు వీరి ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన కరీమ్ జీజీహెచ్‌లో చికిత్స పొందు తున్నాడు. ఆయన పరి స్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బాలికకు తీవ్ర గాయాలు

గుంటూరు జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని నల్లపాడులో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలిక సీహెచ్ లాస్య(8) బాలిక తీవ్రంగా గాయపడింది. పోలీసుల కథనం మేరకు, నల్లపాడుకు చెందిన లాస్య బుధవారం ఉదయం షాప్ వద్దకు వెళ్లేందుకు రోడ్డు దాటుతోంది. డివైడర్ మీద నుంచి బాలిక కిందకు దిగిన వెంటనే పేరేచర్ల వైపు నుంచి గుంటూరు వైపు వస్తున్న ఎలక్ట్రిక్ కారు లాస్యను బలంగా ఢీ కొట్టింది. లాస్య అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు ఈ మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు గుర్తించారు.



బృందావన్‌గార్డెన్స్‌లోని అన్నమయ్య కళావేదికపై కూచిపూడిని ప్రదర్శిస్తున్న చిన్నారులు

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శన

గుంటూరు(తూర్పు), జనవరి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శ్రీ భాస్కర డ్యాన్స్ అకాడమి, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కూచిపూడి నృత్యప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాట్యాచారిణి డీ సాత్విక శిష్య బృందం లక్ష్మి ప్రణతి, హెష్నవి, శరణ్య, తనుశ్రీ, ఆరాధ్య, జాహ్నవి, మనస్విని, హాసిని, అక్షిత, సహస్ర, ప్రజ్ఞ, ధరనిత, మోక్షలు గణపతి తాళం, వారాహి, అల్లో నేరెల్లో, అష్టలక్ష్మి, గరుడ గమన, తిరు తిరు జవరాల, పాట్ డాన్స్, మహా గణపతి, తెలుగు భాష విజయం, దశావతారం సంకీర్తనలకు నృత్యాన్ని ప్రదర్శించి అలరించారు.

## త్రిపురనేని రామస్వామి జయంతి

గుంటూరు (విద్య), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్‌వీఆర్ బీఈడీకళాశాలలో బుధవారం త్రిపురనేని రామస్వామి చౌదరి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కవి రాజు సాహితీ సమితి గౌరవాధ్యక్షుడు గద్దె మంగయ్య, అధ్యక్షుడు ఆలోకం పెద్దబ్బయ్య ,ఉపాధ్యక్షుడు రావెలసాంబశివరావు, రావెల బసవ పున్నమ్మ తదితరులు పాల్గొన్నారు. తొలుత రామస్వామి చౌదరి విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కవిరాజు విజయం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిట్టినేని లక్ష్మీనారాయణ,వల్లూరి తాండవ కృష్ణ ,పాటి బండ్ల విష్ణువర్ధన్, చెరుకూరి సత్యనారాయణ ,భైరపు నేని నరేష్, డాక్టర్ పావినేని శివశంకర్, పీవీ రమణ, ప్రిన్సిపాల్ మోటూరి రవి కుమార్ పాల్గొన్నారు.



కవిరాజు విజయం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గద్దె మంగయ్య తదితరులు



అవగాహన సంస్థలో సంప్రదాయక వస్త్ర ధారణలో సీనియర్ సిటిజన్లు

## అలరించిన సంప్రదాయక వస్త్రధారణ పోటీలు

గుంటూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో సంప్రదాయక వస్త్రధారణ పోటీలు అలరించాయి. సంస్థ కార్యాలయంలో పలువురు సీనియర్ సిటిజన్లు సంప్రదాయక వస్త్రధారణలతో పోటీ పడ్డారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీ సింగరయ్య ప్రథమ విజేతగా నిలిచారు. ద్వితీయ బహుమతి పి భావన్నారాయణ, తృతీయ బహుమతి జి వెంకటేశ్వర్లు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా జీవన సంధ్య కార్యదర్శి సిరసవల్లి కృష్ణారావు మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాంతి నిలుస్తుందన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివ రామిరెడ్డి, చంద్రయ్య, ఆర్ వెంకటరత్నం, కోటేశ్వరరావు, జనార్ధనరావు, బసవ గుప్తా, హరి తదితరులు ఉన్నారు.



# పండగవేళ... సరికొత్త లుక్కులు

**సంక్రాంతి సందర్భంగా స్టార్ హీరోల నుంచి చిన్న హీరోలు నటిస్తున్న సినిమాల వరకు కొత్త పోస్టర్స్ విడుదలయ్యాయి. ఈ ప్రచార చిత్రాలతో ప్రేక్షకులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు మేకర్స్.**

'రాజాసాబ్' నుంచి ప్రభాస్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. శర్వానంద్ కథానాయకుడిగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'నారీ నారీ నడుమ మురారీ' టైటిల్‌ను ప్రకటించారు. విశ్వక్‌సేన్ నటిస్తున్న 'లైలా'లో ఫీమేల్ లుక్‌ను రివీల్ చేశారు. బ్రహ్మానందం, రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'బ్రహ్మ ఆనందం' నుంచి కొత్త స్టిల్‌ను విడుదల చేశారు. కిరణ్ అబ్బవరం, రుక్సర్ ధిల్లాన్ జంటగా తెరకెక్కుతున్న 'దిల్‌రూబా' వచ్చే నెల 14న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిస్తున్న సినిమా 'సంతాన ప్రాప్తిరస్తు' నుంచి కొత్త పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు.

# తారల సంక్రాంతి సంబరాలు







తారలు సంక్రాంతిని ఘనంగా సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను సోషల్‌మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి ట్రెడిషనల్ లుక్‌లో కనువిందు చేశారు. రామ్‌చరణ్ తన సతీమణి ఉపాసన, కూతురు క్లీంకారతో కలసి ఫొటో దిగారు. అల్లు అర్జున్ తన సతీమణి స్నేహా రెడ్డి, కూతురు అర్హ, తనయుడు అయాన్‌తో కలసి పిక్ తీసుకున్నారు. మోహన్‌బాబు దంపతులు, తనయుడు విష్ణు ఫ్యామిలీతో తిరుపతిలో కలసి ఫొటోలు దిగారు. వరుణ్‌తేజ్ తన సతీమణి లావణ్యతో కలసి గాలిపటాలు ఎగరేస్తూ ఫొటోలకు ఫోజిచ్చారు. నూతన దంపతులు నాగచైతన్య, శోభితా ధూళిపాళతో సంప్రదాయ దుస్తుల్లో పిక్ తీసుకున్నారు. ఇటీవలే వివాహ బంధంలోకి అడుగుపెట్టిన కీర్తి సురేశ్, ఆంటోని తట్టిల్ జంటగా పండగ వేడుకల్లో తీసుకున్న ఫొటోలను షేర్ చేశారు. అలాగే విఘ్నేష్ నయనతార దంపతులు పిల్లలతో కలసి దిగిన పండగ ఫొటోను షేర్ చేశారు.







# నా కెరీర్‌లో మరో బిగ్ బ్లాక్ బస్టర్



వెంకటేశ్

'మా సినిమాను ఇంతగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు, అభిమానులకు ధన్యవాదాలు. మేం మంచి ఫ్యామిలీ సినిమా ఇవ్వాలనే ఆలోచనతో సంక్రాంతికి వస్తున్నాం అని చెప్పాం. నా కెరీర్‌లో మరో బిగ్ బ్లాక్ బస్టర్ ఇచ్చిన దర్శకుడు అనిల్‌కు థాంక్స్' అని అన్నారు విక్టరీ వెంకటేశ్. ఆయన నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' విడుదలై విజయం సాధించిన నేపథ్యంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. దర్శకుడు అనిల్ మాట్లాడుతూ 'సాధారణంగా బెనిఫిట్ షోలకు ఫ్యాన్స్, యూత్ వెళుతుంటారు. కానీ తొలిసారి ఉదయం నాలుగున్నర షోకి ఫ్యామిలీ ఆడియన్స్ రావడం చాలా ఆనందం కలిగించింది' అన్నారు. సినిమాను హిట్ చేసిన ప్రేక్షకులకు నిర్మాత దిల్ రాజు ధన్యవాదాలు తెలిపారు. పైరసీని ఎంకరేజ్ చేయకుండా థియేటర్లలోనే సినిమా చూడాలని ఆయన కోరారు.

# అందమైన ప్రేమకథ





'బేబీ' కలయిక మరోసారి రిపీట్ అవుతోంది. ఆ సినిమాతో సూపర్ హిట్ కొట్టిన ఆనంద్ దేవరకొండ, వైష్ణవిచైతన్య జంటగా మరో చిత్రం తెరకెక్కనుంది. '90స్' వెబ్ సిరీస్‌తో గుర్తింపు తెచ్చుకున్న ఆదిత్య హసన్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ మేరకు 'యాన్ అన్‌ఫినిష్డ్ స్టోరీ' పేరుతో ఓ అనౌన్స్‌మెంట్ వీడియో విడుదల చేశారు. 'మీరు చూసిన మిడిల్ క్లాస్ ఫ్యామిలీ డ్రామా '90స్'లోంచి పుట్టిన అందమైన ప్రేమకథ ఇది. అన్ని వర్గాలను ఆకట్టుకునేలా చిత్రం తెరకెక్కనుంది" అని పేర్కొన్నారు. త్వరలోనే మరిన్ని వివరాలు ప్రకటించనున్నారు. ఈ సినిమాకు ఎడిటర్: నవీన్ నూలి, సినిమాటోగ్రాఫర్: అజీమ్ మహమ్మద్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్.

# ఆస్కార్ వేడుక రద్దు అవుతుందా?



అమెరికాలోని లాస్‌ఏంజిల్స్ ప్రాంతాన్ని కార్చిచ్చు చుట్టుముట్టి, ఎంతో ఆస్తి నష్టం, ప్రాణ నష్టం కలిగించిన ఫలితం ఇప్పుడు ఆస్కార్ అవార్డుల వేడుకలపై కూడా ప్రభావం చూపుతోందా?. టామ్ హాంక్స్, ఎమ్మా స్టోన్, మెల్ గిబ్సన్, స్టీవెన్ స్పీల్‌బర్గ్ వంటి హాలీవుడ్ ప్రముఖులు ఈ అగ్ని ప్రమాదంతో ఇళ్లు కోల్పోయారు. అలాగే ఆస్కార్ కమిటీలోని నలుగురు సభ్యులు కూడా ఈ కార్చిచ్చు వల్ల ఇళ్లు కోల్పోవడంతో మార్చి రెండున జరగాల్సిన ఆస్కార్ వేడుక రద్దు కావచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. అదే నిజమైతే.. 96 ఏళ్ల ఆస్కార్ చరిత్రలో అవార్డుల వేడుక రద్దు కావడం ఇదే తొలిసారి అవుతుంది. కరోనా వంటి క్లిష్ట సమయంలో కూడా ఆస్కార్ కమిటీ వేడుకని వాయిదా వేసింది తప్ప రద్దు చేయలేదు. ఇప్పుడు కూడా అలాగే చేయవచ్చని కొంతమంది అంటున్నారు. కనీ వినీ ఎరుగని రీతిలో ఇలా కార్చిచ్చు వ్యాపించి లాస్ ఏంజిల్స్‌ను బూడిద కుప్పగా మార్చడంతో ఈ నెల 23న జరగాల్సిన నామినేషన్స్ ప్రకటన వాయిదా వేశారు. పరిస్థితిని గమనిస్తున్న ఆస్కార్ కమిటీ అవార్డుల వేడుక జరిగే తేదీలో ఏదన్నా మార్పు ఉంటే త్వరలో ప్రకటిస్తుందని అంటున్నారు.



## వైభవంగా శ్రీచెన్నకేశవస్వామి గ్రామోత్సవాలు

దుగ్గిరాల, జనవరి 15(ఆంధ్రజ్యోతి): శ్రీభూనీలాసమేత శ్రీచెన్నకేశవ స్వామి వారి ఆలయంలో ధనుర్మాసం ప్రారంభం నుంచి నెలరోజులపాటు సంక్రాంతి పర్వదినం వరకూ స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం స్థానిక ఇన్‌సాన్ గ్యాస్ ఏజన్సీవరకూ కొనసాగింది. భక్తులు స్వామికి టెంకాయలు, సమర్పించగా అర్చకులు హారతులిచ్చి భక్తులను ఆశీర్వదించారు.


శ్రీభూనీలా సమేత శ్రీచెన్నకేశస్వామి గ్రామోత్సవం

## గోమాత గోశాలలో గోపూజ


వడ్లపూడి గోశాలలో గోవులకు దాణా తినిపిస్తున్న బీజేపీ నేతలు

మంగళగిరి సిటీ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): కనుమ పండుగను పురస్కరించుకుని పెదవడ్లపూడి గోమాత గోశాలలో బీజేపీ నాయకులు బుధవారం గోపూజను సంప్రదాయబద్ధంగా నిర్వహించి గోవులకు దాణాను తినిపించారు. బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త శివ సత్యనారాయణ, వలివేటి రామ్మోహన రావు, జవ్వాది అమ్మయ్యచౌదరి, ప్రసాద్, సాంబశివరావు, టీడీపీ నాయకులు పాతూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి జ్యోతిదర్శనం


దుగ్గిరాల శ్రీమణికంఠ అయ్యప్పస్వామి జ్యోతి దర్శనంలో పాల్గొన్న భక్తులు

దుగ్గిరాల, జనవరి 15(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని శ్రీమణికంఠ అయ్యప్ప ఆలయంలో సంక్రాంతి పర్వదిన సందర్భంగా గ్రామోత్సవం, కర్పూర జ్యోతి దర్శనం వైభవంగా నిర్వహించారు. ఆలయం నుంచి ప్రారంభమైన జెండాచెట్టు, శివాలయం, మీదుగా రైలు పేట వరకూ స్వామివారి ఉత్సవమూర్తికి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు జరిపి మధ్యాహ్నం భక్తులకు చద్ది ఏర్పాటు చేశారు. సాయంత్రం 6 గంటల 40ని.లకు ఆలయ శిఖరంపై కర్పూర జ్యోతిని వెలిగించారు. స్వామి వారి కర్పూర జ్యోతి దర్శనం చేసుకున్న అనంతరం ఏడాదికోసారి అపూర్వ అవకాశంగా భక్తులు భావించే ఆలయం ఎదుటనున్న 18 మెట్లపై నడిచి స్వామివారిని దర్శించుకున్నారు.

### వైభవంగా మకర జ్యోతి పడి పూజ..

వట్టిచెరుకూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతవర ప్పాడు గ్రామంలోని శివాలయ ప్రాంగణంలో మంగళవారం రాత్రి మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని అయ్యప్ప స్వామి పడి పూజ, కర్పూర జ్యోతి, మకర జ్యోతిని అయ్యప్ప భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### నేడు ముత్యాలరావు వర్ధంతి

తాడేపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): దివంగత సీపీఐ నేత మానికొండ ముత్యాలరావు 44వ వర్ధంతి గురువారం ఉదయం 10 గంటలకు తాడేపల్లి సీపీఐ కార్యాలయం వద్ద జరుగుతుందని సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య, సహాయ కార్యదర్శి తుడిమిల్ల వెంకటయ్య, బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీపీఐ నేతలు, కార్యకర్తలు అభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఉత్సాహంగా ఎడ్ల బండి లాగుడు పోటీలు


బండి లాగుడు పోటీల్లో పాల్గొన్న ఎడ్ల జత

పొన్నూరు టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి కనుమ పండుగ సందర్భంగా పొన్నూరు పట్టణంలోని పాత పొన్నూరులో బుధవారం ఎడ్ల బండి లాగుడు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ముందుగా ఎడ్ల జతలకు ప్రత్యేక పూజలు జరిపారు. పూజల అనంతరం బండి లాగుడు పోటీలను నిర్వహించారు. పొన్నూరు పరిసర ప్రాంతాలకు చెందిన 12 జతల ఎడ్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఎడ్ల బండి లాగుడు పోటీలను వీక్షించేందుకు పట్టణవాసులతో పాటు సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు తరలివచ్చారు. విజేతలుగా నిలిచిన ఎడ్ల జతలకు నగదు బహుమతులు అందించి రైతులను పాత పొన్నూరు తెలుగు యువత ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. తెలగపాలెం పొన్నూరు పట్టణానికి చెందిన యరసాని శ్రీనివాస్ ఎడ్ల జత 1917 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. చింతలపూడికి చెందిన షేక్ రఫీ యడ్ల జత 1856 అడుగులు లాగి ద్వితీయ స్థానం, చింతలపూడికే చెందిన శాయన రమణ ఎడ్ల జత 1533 అడుగులు లాగి తృతీయ స్థానం సాధించింది.

# రసవత్తరంగా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

మంగళగిరి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని నవులూరు అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. నాలుగో రోజు బుధవారం పశ్చిమగోదావరి, కర్నూలు జట్ల మధ్య నిర్వహించిన మ్యాచ్‌లో పశ్చిమగోదావరి జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమగోదావరి జట్టు ఆరు వికెట్ల నష్టానికిగాను 175 పరుగులు చేసింది. 176 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 153 పరుగలకే ఆల్ అవుట్ అయి పరాజయం పాలైంది. ఆ తదుపరి గుంటూరు, శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన మరోమ్యాచ్‌లో గుంటూరు జట్టు విజేతగా నిలిచింది. గుంటూరు జట్టు నిర్ణీత 15 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి గాను 145 పరుగులను చేయగా శ్రీకాకుళం జట్టు ఏడు వికెట్ల నష్టంతో 130 పరుగులు మాత్రమే సాధించి పరాజయం పాలైంది. పశ్చిమగోదావరి జట్టులో 50 బంతుల్లో 77 పరుగులు చేసిన వేంపాటి జాస్విన్, రెండో మ్యాచ్‌కు సంబంధించి గుంటూరు జట్టులో 33 బంతుల్లో 48 పరుగులు చేసిన కే మహేష్‌కుమార్‌లను మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌లుగా నిర్ణయించారు. వీరిద్దరికి పట్టణ తెలుగుయువత అధ్యక్షుడు బోగి వినోద్, నియోజకవర్గ ఎస్సీసెల్ కన్వీనర్ కనికళ్ల చిరంజీవి తదితరులు కలిసి సంయుక్తంగా రూ.పదివేల వంతున నగదు బహుమతులను అందజేశారు.


మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ నగదు చెక్కును అందజేస్తున్న టీడీపీ నేత కనికళ్ల చిరంజీవి తదితరులు

మూడో రోజు మంగళవారం విజయనగరం, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన జట్ల మధ్య హోరాహోరిగా సాగిన మ్యాచ్‌లో విజయనగరం జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమ గోదావరి జట్టు 14.5 ఓవర్లలో 99 పరుగులు చేసి ఆల్‌అవుట్ అయింది. అనంతరం వంద పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన విజయనగరం జిల్లా జట్టు ఆరు వికెట్ల నష్టంతో కేవలం తొమ్మిది ఓవర్లలోనే 101 పరుగులు చేసి విజయం సాధించింది. ఇప్పటివరకు మూడు మ్యాచ్‌లు ఆడి, విజయనగరం జట్టు వరుస విజయాలు సాధించి మంచి జోరు మీదుంది. ఆ తరువాత మంగళగిరి, కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కర్నూలు జట్టు ఘన విజయాన్ని సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన మంగళగిరి జట్టు 15.1 ఓవర్లలో 71 పరుగులు చేసి ఆల్ అవుట్ అయింది. అనంతరం 72 పరుగుల విజయలక్ష్యంతో బరిలో దిగిన కర్నూలు జట్టు 5.3 ఓవర్లలోనే 72 పరుగులు చేసి మంగళగిరి జట్టుపై విజయాన్ని సాధించింది.

### క్రీడాకారులకు రోటరీక్లబ్ షూస్ అందజేత

ఈ ఎంపీఎల్-3 ప్రీమియర్ లీగ్ పోటీల్లో పాల్గొంటున్న మంగళగిరి క్రీడాకారులకు స్థానిక రోటరీక్లబ్ ఆధ్వర్యంలో 35 జతల షూస్‌ను పంపిణీ చేశారు. నియోజకవర్గ యువతలో క్రీడాస్ఫూర్తిని నింపి వారిని ఉత్సాహపరిచే ఉద్దేశ్యంతో మంగళగిరి టీమ్‌కు ఈ షూస్‌ను అందజేసినట్టు రోటరీక్లబ్ అధ్యక్షులు గాజుల శ్రీనివాసరావు ఈ సందర్భంగా చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి అందె మురళీమోహన్, కోశాధికారి వడ్లమూడి శ్రీనివాసరావు, చార్టెడ్ ప్రెసిడెంట్ ఇసునూరు అనిల్ చక్రవర్తి, ఉపాధ్యక్షులు పారేపల్లి నిరంజన్‌గుప్తా, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ అందె రేవంత్‌కుమార్, కేలావత్ సైదానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విజేతలకు బహుమతుల పంపిణీ

తాడేపల్లి టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్ వద్ద విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, లెమన్ స్పూన్ పోటీలలో విజేతలకు బుధవారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి బహుమతులు పంపిణీ చేశారు. వల్లభనేని వెంకట్రావు మాట్లాడుతూ ఇంటిల్లిపాది అందరూ జరుపుకునే పండుగ సంక్రాంతి అని, ఈ సందర్భంగా క్రీడలు నిర్వహించడం సంతోషకరమన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి మహిళా సంఘం, యువజన సంఘం, ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో సుందరయ్యనగర్ మాలకొండారెడ్డి ప్రాంగణంలో ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, పరుగు పందెం, ఆటపాట కోలాటం, నాటికలు నిర్వహించారు. విజేతలకు బుధవారం రోటరీ క్లబ్ ప్రతినిధులు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు రావూరి రమేష్‌బాబు మాట్లాడుతూ జూద క్రీడలు వద్దు.. సంప్రదాయ క్రీడలు ముద్దు... అని వ్యాఖ్యానించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ మున్సిపల్ చైర్మన్ కొయ్యగూర మహాలక్ష్మి, మం డవ గోపాలరావు, అద్దంకి మురళి, అన్నెం కుసుమ, కె నిర్మల, విఘ్నేశ్వర యూత్ సభ్యులు, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు రావూరి రమేష్‌బాబు, సుకుమార్ రెడ్డి, చంద్ర ఓబులారెడ్డి, పోటీల నిర్వాహక అధ్యక్షులు ఎస్ వెంకటరావు, మురళి, న్యాయవాది మక్కపాటి తులసి, రంగామణి సుబ్బారావు, కొట్టే కరుణ, భుజంగరావు, దేవేంద్ర, ఎస్ గిరిజ, సూరగాని కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందిస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంకట్రావు

### చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం

తుళ్లూరు, జనవరి 15: (ఆంధ్రజ్యోతి) మండలపరిధిలోని లింగాయపాలెంలో గ్రామంలో బుధవారం సాయంత్రం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు అసైన్ రైతులు పాలాభిషేకం చేశారు. ఐదేళ్ల కౌలు చెల్లింపులు జమ కావటంతో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న తమ నాయకులకు రైతులు పాలాభిషేకం చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కౌల్లు లేక అల్లాడిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో జమ కావటంతో ఎంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు అనుమోలు గణేష్ ప్రసాద్, గిత్తం అనిల్, యడ్ల రాజు, కొయ్యగూర మోహనరావు, కురుకుమల్లి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తుళ్లూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి) చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. తుళ్లూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెంకటపాలెం గ్రామానికి చెందిన మువ్వా సురేష్(40) మద్యానికి బానిసైయ్యాడు. దీనిపై ఇంటిలో తరచూ గొడవ జరుగుతుంది. ఈ నెల 13న గడ్డి మందు తాగాడు. ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున సురేష్ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె కుమారులున్నారు. భార్య దుర్గా ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బాబూరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### భవనం పైనుంచి పడి కార్మికుడికి తీవ్ర గాయాలు

తుళ్లూరు రెవెన్యూ పరిధిలో నిర్మాణం జరుగుతున్న స్టేట్ ఫోరెన్సిక్ ల్యాబ్ భవనం పైనుంచి పడిన పెయింటు పని చేసే కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. బుధవారం మూడో అంతస్తులో కొచ్చర్ల శ్యామ్యూల్ పెయింటు పనిచేస్తున్న క్రమంలో అదుపు తప్పి కింద పడిపోయాడు. మధ్యలో వెల్లుడు గోడ గుద్దుకోవటంతో ఛాతి, నడుం భాగాల్లో విరిగినట్టు డాక్టర్లు చెప్పారని బంధువులు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడ హాస్పిటల్‌కు తరలించారన్నారు.

# ప్రోత్సహిస్తే నిష్ణాతులైన క్రీడాకారులు తయారవుతారు

● ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ చిరుమామిళ్ళ వెంకటరత్నం చౌదరి

వట్టిచెరుకూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): క్రీడలకు ప్రాధాన్యాన్ని ఇచ్చి ప్రోత్సహిస్తే గ్రామీణ ప్రాంతాల్లో నిష్ణాతులైన క్రీడాకారులు తయారవుతారని ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ చిరుమామిళ్ళ వెంకటరత్నం చౌదరి, చిరుమామిళ్ళ మోహన్‌రావులు అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని వింజనంపాడు గ్రామంలోని జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో వింజనంపాడు యూత్ ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో నిర్వ హించిన ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతలైన పురుషులు, స్త్రీల విజేతలకు మంగళవారం రాత్రి కప్, నగదు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ చిరుమామిళ్ళ వెంకటరత్నం, ఆయన సోదరుడు చిరుమామిళ్ళ మోహనరావులు పురుషుల జట్టులో ప్రథమ స్థానం సాధించిన కడప సతీష్ టీమ్‌కు కప్‌తో పాటు రూ.35,116 నగదు, ద్వితీయ పురుషుల విభాగంలో ఆర్‌సీఎం యడ్లపాడు టీమ్‌కు గుంటుపల్లి అరుణకుమార్ జ్ఞాపకార్థం తండ్రి చింపిరయ్య ట్రోఫీతో రూ.25,116లు, మూడో బహుమతి సాధించిన ప్రకాశం జిల్లా కడలి టీమ్‌కు పొందూరి శివరామ కృష్ణ రూ.15,116తో పాటు ట్రోఫీని అందజేశారు. అలాగే బాలికల విభాగంలో మొదటి స్థానం సాధించిన తెనాలి జేఎంజే టీమ్‌కు మన్నవ వెంకటేశ్వరరావు రూ.15,116లు, ద్వితీయ స్థానం సాధించిన వేంజెండ్ల టీమ్‌కు నంబూరి రంగయ్య తదితరుల జ్ఞాపకార్థం కోయ వెంకటేశ్వరరావు రూ.10,116లు, తృతీయ స్థానం సాధించిన వింజనంపాడు టీమ్‌కు మాజీ సర్పంచ్ చిరుమామిళ్ళ వెంకట కృష్ణారావు రూ.5,116లు నగదుతో పాటు ట్రోఫీలను అందజేశారు.


వాలీబాల్ టోర్నమెంట్‌లో ప్రథమ స్థానం కైవసం చేసుకున్న కడప సతీష్ టీమ్‌కు కప్ అందిస్తున్న ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ వెంకటరత్నం చౌదరి

### స్ఫూర్తి ప్రదాత కత్తి పద్మారావు

● గాయకుడు జయరాజు

పొన్నూరు టౌన్, జనవరి15 (ఆంధ్రజ్యోతి): కవిత్వానికి, జీవన తత్వానికి స్ఫూర్తి ప్రదాత డాక్టర్ కత్తి పద్మారావు అని గాయకుడు జయరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని డాక్టర్ కత్తి పద్మారావు గృహానికి గాయకుడు జయరాజ్, మంగతాయారు దంపతులు విచ్చేశారు. ఈ సందర్భంగా జయరాజు అనేక పాటలు పాడి వినిపించారు. అనంతరం కత్తి పద్మారావుకు జయరాజు రచించిన పుస్తకాలను అందజేశారు. దంపతులను డాక్టర్ కత్తి పద్మారావు స్వర్ణకుమారి దంపతులు సత్కరించి అంబేద్కర్‌పై రూపొందించిన పుస్తకాలను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

# ఆనందోత్సాహాలతో సంక్రాంతి వేడుకలు

దుగ్గిరాల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి సంబరాలను మూడ్రోజులపాటు కుటుంబసభ్యులతో కలిసి ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. సంక్రాంతి సందర్భంగా ఉదయాన్నే ఇళ్లముంగిట రంగవల్లులు వేసి, గొబ్బిళ్లను అమర్చి అందంగా తీర్చిదిద్దారు. వాకిళ్లలో చెరకు గడలను ఉంచి పక్కనే ముగ్గువేసి, ఆవు పేడతో చేసిన పిడకలతో కట్టెలపొయ్యిమీద ఇత్తడి పాత్రలో, ఆవుపాలతో, పొలం నుంచి వచ్చిన కొత్త పంట బియ్యంతో పొంగలి సిద్ధం చేసిన అనంతరం, పూజ జరిపి కుటుంబసభ్యులతో సహపంక్తి భోజనం చేశారు. కనుమనాడు రథం ముగ్గులతో ముంగిళ్లను అందంగా తీర్చిదిద్దారు. బంధాలు, అనుబంధాలు బలపడేలా, కుటుంబంలో జరిగిన ఎన్నో విశేషాలను అరమరికలు లేకుండా తమ జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ, తమ అనుభవాలను పంచుకున్నారు. చింతలపూడిలో ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలైన మహిళలకు బహుమతులను అందించారు. ఏడీఏ రాజకుమారి, దూళ్ల హరియాదవ్, సర్పంచ్ తాడిబోయిన రామకృష్ణ, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.


పొంగలి చేస్తున్న పెదకొండూరు మాజీసర్పంచ్ పిచ్చయ్య కుటుంబసభ్యులు


ముగ్గుల పోటీల్లో విజేతలైన మహిళలకు బహుమతులను అందిస్తున్న ఏడీఏ రాజకుమారి, ఎంపీడీవో వీరాంజనేయులు

**వట్టిచెరుకూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి):** సంక్రాంతి పర్వదినాన్ని మంగళవారం మండల వ్యాప్త గ్రామాల్లో కన్నుల పండువగా జరుపుకున్నారు. గృహాల్లో స్వర్గస్తులైన కుటుంబ పెద్దల చిత్రపటాలకు పూలమాలలతో అలంకరించి నూతన వస్త్రాలను సమర్పించారు.

### వేంకటేశ్వర స్వామి తెప్పోత్సవం


గరుడు వాహనంపై విహరిస్తున్న శ్రీ వెంకటేశ్వర స్వామి

చేబ్రోలు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి శేకూరులోని వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి సంగం జాగర్లమూడి వరకు ఉన్న కాలువలో మకర సంక్రాంతి సందర్భంగా స్వామివారికి విశేష పూజలు జరిగాయి. మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత స్వయంభు శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో తెప్పోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి సంగం జాగర్లమూడి శివారు వరకు ఈ ఉత్సవం జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొనసాగుతున్న చంద్రశేఖర స్వామి ఆర్ద్ర మహోత్సవాలు

పెదకాకాని, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండలం తక్కెళ్ళపాడులో గంగా భ్రమరాంబ సమేత చంద్రశేఖర స్వామి వారి 82వ వార్షిక ఆర్ద్ర మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉత్సవాల్లో నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీకి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కూరెళ్ల వెంకట చంద్రశేఖర ప్రసాద్ స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం ఎంపీ చంద్రశేఖరస్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ నెల 17వ తేదీ వరకు స్వామివారి ఉత్సవాలు వైభవంగా జరిపించనున్నారు. చంద్రశేఖరస్వామికి నిత్య కల్యాణం, అమ్మవారికి కుంకుమ పూజలు సామూహికంగా నిర్వహించనున్నారు.


ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలను సత్కరిస్తున్న ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కూరెళ్ల వెంకట చంద్రశేఖర ప్రసాద్

## స్వాతంత్ర్య సమరయోధుడు త్రిపురనేనికి నివాళి


రామస్వామి చౌదరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయ అధికారులు

లాంఫాం(తాడికొండ), జనవరి 15(ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావటానికి పోరాటం చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు త్రిపురనేని రామస్వామి చౌదరి అని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జీ రామచంద్రరావు తెలిపారు. బుధవారం విశ్వవిద్యాలయంలోని పరిపాలనా భవనంలో రామస్వామి చౌదరి జయంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ హేతువాద రచయిత, సంఘసంస్కర్త, న్యాయ నిపుణుడు, కవి రాజుగా రామస్వామి చౌదరి కీర్తి గడించారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను ఉత్తేజపరిచే అనేక దేశభక్తి గీతాలను రచించారని, పురణాలను, వేదాలను అధ్యయనం చేశారన్నారు. సాంఘిక దురాచారాల మీద పూర్తిస్థాయి ఉద్యమం చేశారన్నారు. మహానుభావులను గుర్తు చేసుకోవడం వల్ల భావితరాల్లో తెలుగు సాహిత్యం మీద ప్రేమని, సాంఘిక దురాచారాలను నిర్మూలించవలసిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ బీ శ్రీలక్ష్మీ, కంట్రోలర్ బీవీఎస్ ప్రసాద్ బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్రాంతి సంబరాల్లో ఒకే కుటుంబ సభ్యులు

దుగ్గిరాల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాలకు దేశవిదేశాల్లోనూ, ఇతర రాష్ట్రాల్లోనూ, నగరాల్లోనూ ఉంటూ వివిధ ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడిన ఒకే కుటుంబానికి చెందిన సభ్యులు స్వగ్రామానికి చేరుకున్నారు. మూడ్రోజుల పాటు భోగి, సంక్రాంతి, కనుమ వేడుకల్లో ఆప్యాయత, అనురాగాల మధ్య ఉత్సాహంగా గడిపారు. ఈమనిలో సంక్రాంతి సందర్భంగా యడ్ల సాంబశివకోటేశ్వరరావు, పసుపులేటి మారుతీప్రసాద్‌ల కుటుంబాలకు చెందిన 60మందికి పైగా సభ్యులు ఆటపాటలతో, ఆనందోత్సాహాల మధ్య సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. దశాబ్దాల తరబడి ఇలా సంక్రాంతికి స్వగ్రామానికి వచ్చి వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందాన్నిస్తోందని కుటుంబసభ్యులు తమ అనుబంధం గురించి గర్వంగా ఉందన్నారు. ఏటా సంక్రాంతి పండుగకు గ్రామానికి వచ్చి ఆనందంగా గడుపుతున్నామని చెప్పడం స్ఫూర్తిదాయకం.

## సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి


గుండాలపాడులో హరిదాసునకు స్వయంపాకం అందిస్తున్న జిల్లా సర్పంచుల సంఘం కార్యదర్శి కంభం పెదబాబు

ఫిరంగిపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): భారతదేశం గ్రామాల్లోనే ఉందన డానికి సంక్రాంతి పండుగే నిదర్శనమని సర్పంచుల సంఘం జిల్లా కార్యదర్శి కంభం పెదబాబు అన్నారు. మంగళవారం సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని గుండాలపాడు గ్రామంలో హరిదాసుకు స్వయంపాకం ఇచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ పండుగలో ప్రాచీన కళలు, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, ఆహార పదార్థాలు కనువిందు చేస్తున్నాయన్నారు. గ్రామాల్లో సంక్రాంతి ప్రజలకు క్రాంతి నింపుతున్నదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామంలోని పెద్దలు, బంధు మిత్రులు పాల్గొన్నారు.

## విశ్వవేదం రచయితకు ఘన సత్కారం


రచయిత తాడికొండ శివాజీ దంపతులను సత్కరిస్తున్న నవులూరు గ్రామస్థులు

మంగళగిరి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): విశ్వవేదం పేరుతో ఓ చారిత్రక గ్రంథాన్ని రచించిన నవులూరు నివాసి తాడికొండ శివాజీని గ్రామస్థులు మంగళవారం రాత్రి ఘనంగా సత్కరించారు. గ్రామంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి వారి దేవస్థానంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి మకరజ్యోతి దర్శన పూజా మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళగిరి పరిసర ప్రాంత ప్రజలు ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో హాజరై స్వామివారికి విశేష పూజలను నిర్వహించి మకరజ్యోతిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సుమారు నాలుగువేల మందికి అన్నసంతర్పణ చేశారు. విశ్వవేదం మహాగ్రంథాన్ని రచించిన గ్రామనివాసి తాడికొండ శివాజీ, ఆయన సతీమణి కళ్యాణి దంపతులను ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామస్థులు కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ గౌరవాధ్యక్షుడు కొల్లి లక్ష్మయ్యచౌదరి, అధ్యక్షులు రుద్రు బాబూరావు, ఉపాధ్యక్షుడు ఆడెపు శివ నాగేశ్వరరావు, కార్యదర్శి బత్తుల సాంబశివరావు, సహాయ కార్యదర్శి రంగిశెట్టి శంకరరావు, కోశాధికారి బత్తుల శ్రీనివాసరావు, రుద్రు సాంబశివరావు, మాగంటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## 43వ రోజుకు చేరుకున్న ఏసీసీ కార్మికుల దీక్షలు


దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

తాడేపల్లి టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏసీసీ సిమెంటు కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు బుధవారంతో 43వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను సీఐటీయూ నేత వేముల దుర్గారావు, యూనియన్ నేత కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వేముల దుర్గారావు మాట్లాడుతూ 32 సంవత్సరాల నుంచి సిమెంట్ కంపెనీ కార్మికులు నష్టపరిహారం కోసం ఎదురు చూస్తూ, అర్ధాకలితో అలమటిస్తున్నారని అన్నారు. న్యాయబద్ధంగా కార్మికులకు రావలసిన నష్టపరిహారాన్ని కంపెనీ యాజమాన్యం చెల్లించే వరకు, ప్రభుత్వం జోక్యం చేసుకుని నష్ట పరిహారం ఇప్పించేంత వరకు కార్మికులు పోరాడుతూనే ఉంటారని అన్నారు. ఈ దీక్షల్లో నవనీతం, ఎస్‌కే సుభాని, బి.సూర్య ప్రకాష్, ఎస్‌కే ఇమాంబి, విజయలక్ష్మి కూర్చున్నారు. కార్యక్రమానికి మద్దతుగా ఎం ఆశీర్వాదం, సీహెచ్ పిచ్చయ్య, జేకే మూర్తి, ఎస్‌కే బాషా, ఖాసిం, హగ్గయ్య, శాస్త్రి, ఆరిఫ్, ఎండీ రహంతుల్లా, శారమ్మ, నాగమల్లేశ్వరి, రమణ, బూదెమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



## స్ఫూర్తి ప్రదాత కత్తి పద్మారావు: గాయకుడు జయరాజు

పొన్నూరు టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కవిత్వానికి, జీవన తత్వానికి స్ఫూర్తి ప్రదాత డాక్టర్ కత్తి పద్మారావు అని గాయకుడు జయరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని డాక్టర్ కత్తి పద్మారావు గృహానికి గాయకుడు జయరాజ్, మంగతాయారు దంపతులు విచ్చేశారు. ఈ సందర్భంగా జయరాజు అనేక పాటలు పాడి వినిపించారు. అనంతరం కత్తి పద్మారావుకు జయరాజు రచించిన పుస్తకాలను అందజేశారు. దంపతులను డాక్టర్ కత్తి పద్మారావు స్వర్ణ కుమారి దపంతులు సత్కరించి అంబేద్కర్‌పై రూపొందించిన పుస్తకాలను బహూమతిగా అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

## యువకుడు మృతి

తెనాలి మారీసుపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): యువకుడు మృతిచెందిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బాలాజీరావు పేటలోని సచివాలయం దగ్గర మంగళవారం యువకుడు మద్యం అధికంగా సేవించి మృతిచెంది ఉండటాన్ని గమనించి బంధువులకు సమాచారమిచ్చారు. వారు అతని మృతదేహన్ని అక్కడ నుంచి తరలించారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

## యాచకుడు...

తెనాలి మారీసుపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): యాచకుడు మృతిచెందిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక మారీసుపేటలో ఒక యువకుడు యాచన చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. బుధవారం చెంచుపేట ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద అనారోగ్య సమస్యలతో మృతిచెంది ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. యాచకుని మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించామని పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వదిన మృతి

● మరిదికి తీవ్ర గాయాలు

గుంటూరు జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని పొత్తూరు సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వదిన మృతి చెందగా మరిది తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పొన్నూరు సమీపంలోని నండూరు వద్ద గల ఇటికంపాడు గ్రామానికి చెందిన దిల్దార్ (55) అనే మహిళ చిలకలూరిపేటలో బంధువుల శుభకార్యానికి వెళ్ళింది. ఆమెకు మరిది అయిన రేపల్లెకు చెందిన షేక్ కరీమ్ అదే శుభకార్యానికి వెళ్ళారు. ద్విచక్రవాహనంపై కరీమ్ తిరుగు ప్రయాణం కాగా అదే వాహనంపై ఆమె వదిన దిల్దార్ కూడా ఎక్కింది. వారు పొత్తూరు సమీపానికి రాగానే చిలకలూరిపేట వైపు నుంచి వేగంగా వస్తున్న ఎలక్ట్రిక్ కారు వీరి ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతిచెందగా తీవ్రంగా గాయపడిన కరీమ్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవాలి

● ఆచార్య పార్థసారధి

తెనాలి రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న భారతీయ సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మారిషస్ దేశంలోని హరిహర దేవస్థానం నిర్వాహకులు, సనాతన ధర్మప్రచారకర్త ఆచార్య బృందావనం పార్థసారథి అన్నారు. బుధవారం తెనాలి విచ్చేసిన ఆయనను పట్టణానికి చెందిన శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. హర్యానాకు చెందిన నీలం యూనివర్సిటీ సనాతన ధర్మప్రచారానికి ఆయన చేస్తున్న సేవలకు గాను డాక్టరేట్‌ను ప్రధానం చేసి అభినందించడంపై సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ఆయన మరిన్ని ధర్మప్రచార కార్యక్రమాలను చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు ఆర్.వి.కిరణ్‌కుమార్, ట్రస్ట్ గౌరవాధ్యక్షులు రొంపిచర్ల శ్రీనివాస మూర్తి, సభ్యులు రొంపిచర్ల సురేష్, మూర్తి వెంకటేశ్వరరావు, జంధ్యం రామారావు, గుడివాడ బాలకృష్ణ, మదుపల్లి చంద్రశేఖర్, శ్రీ పంచముఖ అంజనేయస్వామి సంకీర్తన బృందం సభ్యులు, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న సాగుకు నీరు అందక ఇబ్బందులు

తెనాలి అర్బన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెదరావూరు చానల్ కింద నీరందక మొక్కజొన్న సాగుచేసే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తెనాలి నుంచి పెదరావూరు మీదుగా వెళ్ళే ఈ కాలువలో దట్టంగా గుర్రపు డెక్క అల్లుకుపోయింది. దీంతో నీరు దిగువ ప్రాంతాలకు పారడంలేదు. మొక్కజొన్నకు నీరు అందించాల్సిన తరుణంలో నీరు అందకపోతే దిగుబడిపై ప్రభావం చూపుతుందని రైతులు వాపోతున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి గుర్రపు డెక్క తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



పెదరావూరు చానల్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్క

# ఘనంగా సంక్రాంతి సంబరాలు



పొన్నూరు: కనుమ పండుగ సందర్భంగా గోమాతకు పూజ చేస్తున్న భక్తులు



తెనాలిలోని నిజాంపట్నం కాల్వలో పడవపై ఊరేగుతున్న స్వామివారు

తెనాలి అర్బన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం సంక్రాంతి పండుగ ఘనంగా జరుపుకున్నారు. పలు ఆలయాల్లో భక్తులు దర్శనం చేసుకుని పూజలు జరిపించారు. గంగానమ్మపేట పాత శివాలయంలో, రామేశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. స్వామివారికి విశేష అలంకారం చేశారు. అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని గజ వాహనంపై ఊరేగించారు. ఈవో రమణకుమారి, అర్చకులు పర్యవేక్షించారు. మారీసుపేట శివాలయంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అయ్యప్పస్వామికి మకర సంక్రాంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మకరజ్యోతి వెలిగించారు. మాజీ న్యాయమూర్తి గ్రంధి గోపాలకృష్ణమూర్తి దంపతులు, కమిటీ అధ్యక్షుడు గ్రంధి సేతు మాధవరావు, పొన్నూరు శశి, శేషగిరిరావు, హరి, అంకరాజు అర్చకులు మణిశర్మ తదితరులు పాల్గొన్నారు. బాలాజీరావుపేటలో పట్టాభిరామ స్వామి ఆలయంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కౌన్సిలర్ సంజీరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారిని గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకులు నాగమారుతీ, భక్తులు పాల్గొన్నారు. చెంచుపేట అమరావతి కాలనీలో ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు విశేషంగా ఆకట్టుకుంది. సంప్రదాయాన్ని గుర్తుచేసేలా నారుమడి, నూర్పిడి వంటి పలు బొమ్మలతో రైతుల కష్టం కనపడేలా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువును స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

### వైకుంఠపురం ఆలయాన్ని తీర్చిదిద్దుతాం: మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వైకుంఠపురం ఆలయాన్ని భక్తులు మెచ్చేలా తీర్చిదిద్దుతామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. వైకుంఠపురంలో మంగళవారం సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవెంకటేశ్వరస్వామిని నిజాంపట్నం కాలువలో అలంకరించిన పడవలో తెప్పోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పూజల్లో మంత్రి పాల్గొన్నారు. మంత్రి



గరుడు వాహనంపై విహరిస్తున్న వెంకటేశ్వరస్వామి

మాట్లాడుతూ సంప్రదాయాలను మర్చిపోకుండా పండుగలను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. వైకుంఠపురం ఆలయం వంతెన వద్ద నుంచి వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల వరకు తెప్పోత్సవం కన్నుల పండుగగా సాగింది. దారి పొడవునా భక్తులు స్వామి, అమ్మవార్లను తిలకించారు. విద్యుత్ దీపాలు, పూలతో పడవను అలంకరించారు. విద్యార్థులు కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. ఈవో అనుపమ, డీఎస్పీ బి.జనార్ధనరావు, ట్రస్టు బోర్డు చైర్మన్ కుంభం సాయిబాబు, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

● పొన్నూరు టౌన్, చేబ్రోలు: పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో మంగళ, బుధవారాల్లో తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతి, కనుమ వేడుకలు అంబరాన్ని అంటాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలు రంగురంగుల రంగవల్లులతో గృహాలను శోభాయమానంగా తీర్చిదిద్దారు. పండుగను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. సంక్రాంతిని ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకున్నారు. బుధవారం కనుమ పండుగను పురస్కరించుకొని రైతులు వ్యవసాయంలో చేదోడు వాదోడుగా ఉన్న పాడి పశువులను, ఎద్దులను పూజించారు. పెద్దలను స్మరించుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా పలు ప్రాంతాల నుంచి సొంత గ్రామాలకు వచ్చిన యువత పిండి వంటలను ఆస్వాదిస్తూ, గాలి పటాలు ఎగురవేస్తూ ఆనందోత్సాహాలతో సంక్రాంతి పండుగను జరుపుకున్నారు. పట్టణంలోని సాక్షి భావనారాయణ స్వామి ఆలయంలో కనుమ పండుగ సందర్భంగా గోమాతను పూజించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



తెనాలిలో జరిగిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

● కొల్లిపర: భోగి మంటలు... బొమ్మల కొలువులు... రంగుల రంగవల్లులు... గొబ్బెమ్మల పాటలు.. కోలాటాలు.. గంగిరెద్దుల విన్యాసాలు.. గాలి పటాల సోయగాలు... వెరసి తెలుగు సంస్కృతి, సంప్రదాయాల కలబోత సంక్రాంతి సంబరాలు మూడు రోజులుగా మండలంలో కన్నుల పండుగా నిర్వహించారు. సంక్రాంతి సంబరాలతో పల్లెలు పులకించాయి. వృత్తిరీత్యా ఎక్కడెక్కడో పని చేస్తున్నవారు తమ కుటుంబాలతో సహా స్వగ్రామాలకు వచ్చి ఆత్మీయ అనురాగాలతో సంక్రాంతి వేడుకల్లో పాల్గొనటంతో పల్లెలోగిళ్ళు కళకళలాడాయి. ముత్యాల ముగ్గులు తీర్చిదిద్దుతూ మహిళలు సందడిగా గడిపారు. మండల పరిధిలోని తూములూరులో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో రాష్ట్ర



కొల్లిపర మండలం తూములూరులో ముగ్గులను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొనటంతో గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. గ్రామస్థులు ముగ్గుల పోటీలు నిర్వహించడంతో వాటిని పరిశీలించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. మండల కేంద్రం కొల్లిపర శ్రీజనార్థన స్వామి ఆలయంలో పండితులు పూజలుచేసిన అనంతరం ఉత్సవ విగ్రహాలను గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు హారతులు ఇచ్చి తమ భక్తిభావాన్ని చాటుకున్నారు. అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో 115మంది మహిళలు పాల్గొని పోటీలు పడి రంగవల్లులను తీర్చిదిద్దారు. కొంతమంది మహిళలు బొమ్మల కొలువులు నిర్వహించి ముగ్గులలో గొబ్బెమ్మలను ఏర్పాటుచేసి పాటలు పాడారు. దీంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పూర్వీకులను తలచుకుని కొంతమంది కలసి భోజనాలు చేశారు. కనుమ కావడంతో మండలంలోని మాంసపు దుకాణాలు కిటకిటలాడాయి. మటన్, చికెన్, చేపల దుకాణాల వద్ద సందడి నెలకొంది.

### ఘనంగా వెంకటేశ్వర స్వామి తెప్పోత్సవం

చేబ్రోలు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శేకూరులోని వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి సంగం జాగర్లమూడి వరకు ఉన్న కాలువలో మకర సంక్రాంతి సందర్భంగా స్వామివారికి విశేష పూజలు జరిగాయి. మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత స్వయంభు శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో తెప్పోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి సంగం జాగర్లమూడి గ్రామ శివారు వరకు ఈ ఉత్సవం జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పెద్ద సంఖ్యలో విచ్చేసి ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. ఆలయ ఈవో రామకోటేశ్వరరావు పర్యవేక్షణలో తెప్పోత్సవం జరిగింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాలడుగు జయ నాగలక్ష్మి, రవీంద్ర దంపతులు, ఆలయ వంశపారంపర్య అర్చకులు నారాయణం కృష్ణచార్యులు, కిరణ్ కమలాకర్, రామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

### సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాలి: ఆలపాటి

కొల్లిపర: సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండల కేంద్రం కొల్లిపర శివారు బొమ్మువానిపాలెంలో కోడి పందేలను మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పండుగ సందర్భంగా ఒక సరదాగా మాత్రమే జరుపుకోవాలని జూదంగా జరుపుకోవడం మంచి విధానం కాదన్నారు. సంప్రదాయాలను విడనాడకుండా ఉండేందుకు కోసమే కోడి పందేలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమాజానికి ఇబ్బంది కలిగే రీతిలో కాకుండా వినోదాత్మకంగా కోడి పందేలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఆలపాటి రాజేంద్రప్రసాద్ సతీమణి మాధవి, టీడీపీ సీనియర్ నాయకుడు ఘట్టమనేని రామకృష్ణ, సర్పంచ్‌లు కొల్లి రజనీశివరామిరెడ్డి, పాలడుగు జోగేంద్ర, టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, దుగ్గిరాల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, తాతా అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్పస్వామి పూజల్లో పాల్గొన్న మాజీ న్యాయమూర్తి గోపాలకృష్ణమూర్తి దంపతులు

● కొల్లిపర: మండల కేంద్రం కొల్లిపర శ్రీ అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలో శ్రీ కళానిలయం ఆధ్వర్యంలో సంక్రాంతి సాంస్కృతిక సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. డాక్టర్. సి.నారాయణరెడ్డి, గుదిబండి తిరుమలరెడ్డి స్మారక కళా ప్రాంగణంలో కాంట్రాక్టర్ గుదిబండి చినవెంకటరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. వివేక మోడల్ స్కూల్ విద్యార్థిలు జానపద, ప్రత్యేక నృత్యప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులు కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు ఎంపీపీ భీమవరపు పద్మావతి, ఏఆర్ఆర్ కళాశాల కార్యదర్శి అవుతు కృష్ణారెడ్డి, గుదిబండి సాయిప్రసాదరెడ్డిలు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో శ్రీకళానిలయం అధ్యక్షుడు జొన్నల అమ్మిరెడ్డి, ఉపాధ్యక్షుడు గుదిబండి పెదనాగిరెడ్డి, కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గ్రామ పెద్దలు వంగా లక్ష్మారెడ్డి, కూరపాటి రవిశేఖర్‌రెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, బొమ్మారెడ్డి మురళిమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొల్లిపరలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో జానపద నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

● తెనాలి అర్బన్: రూరల్ మండలంలోని కఠెవరంలో సంక్రాంతిని పురస్కరించుకుని మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అల్లూరి యువసేన ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ముగ్గులు వేశారు. విజేతలు లాస్య, మహి, హరితలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

● తెనాలి అర్బన్: సంక్రాంతిని పుస్కరించుకుని చినరావూరు రైల్వే స్టేషన్ వద్ద బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. జై సేవాలాల్ లంబాడా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ వనజ, డాక్టర్ శిల్పలు వ్యవహరించారు. 70మంది మహిళలు ముగ్గులు వేశారు. విజేతలతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. తిరువూరు జడ్జి మోతీలాల్‌నాయక్, సంఘ అధ్యక్షుడు ప్రసాద్ నాయక్, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.



తెనాలిలో జరిగిన అయ్యప్పస్వామిని ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

### అయ్యప్ప ఆలయంలో కర్పూర జ్యోతి

పొన్నూరు టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని ఆలూరు రోడ్‌లోని శ్రీహరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం కర్పూర జ్యోతి కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మకర సంక్రాంతి రోజున అయ్యప్ప స్వామి కర్పూర జ్యోతి రూపంలో భక్తులకు దర్శనం ఇస్తారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామి మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం భక్తుల శరణు ఘోష మధ్య కర్పూర జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో జరిగింది. కర్పూర జ్యోతిని వీక్షించి భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అలాగే పట్టణ శివారులోని జీబీసీ రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయంలో పడిపూజ మహోత్సవం కర్పూర జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

## ఉత్సాహంగా ఎడ్ల బండి లాగుడు పోటీలు



బండి లాగుడు పోటీలలో పాల్గొన్న ఎడ్ల జత

పొన్నూరు టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి కనుమ పండుగ సందర్భంగా పొన్నూరు పట్టణంలోని పాత పొన్నూరులో బుధవారం ఎడ్ల బండి లాగుడు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ముందుగా ఎడ్ల జతలకు ప్రత్యేక పూజలు జరిపారు. పూజల అనంతరం బండి లాగుడు పోటీలను నిర్వహించారు. పొన్నూరు పరిసర ప్రాంతాలకు చెందిన 12 జతల ఎడ్లు ఈ పోటీలలో పాల్గొన్నాయి. ఎడ్ల బండి లాగుడు పోటీలను వీక్షించేందుకు పట్టణవాసులతో పాటు సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు తరలివచ్చారు. విజేతలుగా నిలిచిన ఎడ్ల జతలకు నగదు బహుమతులు అందించి రైతులను పాత పొన్నూరు తెలుగు యువత ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. తెలగపాలెం పొన్నూరు పట్టణానికి చెందిన యరసాని శ్రీనివాస్ ఎడ్ల జత 1917 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. చింతలపూడికి చెందిన షేక్ రఫీ యడ్ల జత 1856 అడుగులు లాగి ద్వితీయ స్థానం, చింతలపూడికే చెందిన శాయన రమణ ఎడ్ల జత 1533 అడుగులు లాగి తృతీయ స్థానం సాధించింది.

### 18న త్యాగరాజు స్వామి ఆరాధనోత్సవం

తెనాలి అర్బన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బోసురోడ్డులోని శ్రీవాసవి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 18న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం నిర్వహిస్తారు. త్యాగరాజ గాన సభ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో గుంటూరు గాయకురాలు డి.వి.ఆర్.సీత, పంచరత్న కీర్తలు ఆలపిస్తారు. శ్రోతలు జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

## జూదరుల అరెస్టు

పిట్టలవానిపాలెం, జనవరి 15 (ఆంధ్రజ్యో తి): పిట్టలవానిపాలెం గ్రామపంచాయతీలోని పంటపొలాల్లో కోడిపందేలు ఆడుతుండ గా చందోలు ఎస్ఐ ఆర్ స్వామి శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి బుధవారం దాడులు నిర్వహించారు. కోడిపందెపురాయుళ్ళ నుంచి నాలుగు కోడిపుంజులు, రూ.2500 నగదును స్వాధీనం చేసుకొని ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.



చంద్రశేఖరస్వామి వారి ఆర్ద్ర మహోత్సవాలలో పాల్గొన్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలును సత్కరిస్తున్న ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కూరెళ్ల వెంకట చంద్రశేఖర ప్రసాద్

## కొనసాగుతున్న చంద్రశేఖర స్వామి ఆర్ద్ర మహోత్సవాలు

● పాల్గొన్న నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

పెదకాకాని, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండలం తక్కెళ్ళపాడులో గంగా భ్రమరాంబ సమేత చంద్రశేఖర స్వామి వారి 82వ వార్షిక ఆర్ద్ర మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉత్సవాలలో నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీకి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కూరెళ్ల వెంకట చంద్రశేఖర ప్రసాద్ స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం ఎంపీ చంద్రశేఖరస్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ నెల 17వ తేదీ వరకు స్వామివారి ఉత్సవాలు వైభవంగా జరిపించనున్నారు. చంద్రశేఖరస్వామి వారికి నిత్య కల్యాణం, అమ్మవారికి కుంకుమ పూజ భక్తులు సామూహికంగా నిర్వహించనున్నారు.

## సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి

● రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరావు






తెనాలి రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరావు చెప్పారు. బుధవారం సైబర్ నేరాలపై ఆంధ్రజ్యోతికి తెలిపిన వివరాలు...

**ప్రశ్న:** సైబర్ నేరాలంటే ఏమిటి?

**జవాబు:** టెక్నాలజీని ఉయోగించి కంప్యూటర్ లేదా ల్యాప్‌టాప్ వంటి పరికరాలతో ఇంటర్‌నెట్ ద్వారా ఇతరుల డేటా, లేదా బ్యాంక్ బ్యాలెన్స్ ఇతరత్రా వ్యక్తిగత గోప్యతను చోరీ చేయడాన్ని సైబర్ నేరాలంటారు.

**ప్రశ్న:** సైబర్ నేరాల్లో ఎక్కువగా ఎటువంటి మోసాలు జరుగుతున్నాయి?

**జ:** క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, బ్యాంక్ ఖాతాలు, సోషల్ మీడియాల్లో పెట్టే ఫొటోలు మార్ఫింగ్ చేయడం, టెక్నాలజీని ఉపయోగించి వ్యక్తులను టార్గెట్ చేయడం, ఆన్‌లైన్ బెట్టింగ్‌లో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

**ప్రశ్న:** సైబర్ నేరగాళ్లకు చట్టాలు వర్తిస్తాయా?

**జ:** సైబర్ క్రైంలో డిజిటల్ ఖాతాలలో లావాదేవీల దొంగతనం, ఆన్‌లైన్ లోన్లు ఇస్తామంటూ మోసం, ఫోటోలు, సంతకాలు ఫోర్జరీ, సోషల్ మీడియాల్లో తప్పుగా ప్రచారం చేస్తూ పరువు నష్టం, అల్లర్లు వంటి నేర కార్యకలాపాలు ఉంటాయి. వీటన్నింటికీ బీఎన్ఎస్ యాక్ట్ ప్రకారం శిక్షలు విధిస్తారు. సమాచార చట్టం 2000 కింద అన్నిరకాల సైబర్ నేరాలకు శిక్షలున్నాయి.

**ప్రశ్న:** సైబర్ నేరాలకు గురైన వారు ఎలా ఫిర్యాదు చేయాలి?

**జ:** సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి మోసపోయిన వారు గుంటూరులోని సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ సెల్‌కు ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. బాధితుల పేరు, మెయిలింగ్ అడ్రస్, ఇతర వివరాలను ఫిర్యాదులో పేర్కొనాలి. నేరం ఎలా జరిగిందనే అంశాన్ని రిపోర్టులో స్పష్టంగా నమోదు చేయాలి. అత్యవసరమైతే స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలి. టోల్ ఫ్రీ నెం 1930కి కూడా ఫిర్యాదు చేయవచ్చు.